ప్రజాశక్తి

ఆదివారం 25 డిసెంబర్ 2022 8 పేజీలు





గుంటూరు పల్నాడు

రబీ సాగు మందగమనం



- రెండునెలలు దాటినా ఇంకా పుంజుకోని సేద్యం
- గుంటూరు జిల్లాలో 25 శాతమే
- పల్నాడు జిల్లాలో 50 శాతం పూర్తి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

రబీ సీజన్ ప్రారంభమై రెండు నెలలు దాటినా గుంటూరు, పల్నాడు జిల్లాలో సాగు ఊపందుకోలేదు. ప్రధానంగా కృష్ణా డెల్టా పరిధిలో మొదటి పంటగా వరి సాగు చేసిన రైతులు రెండో పంటగా వరి కోతలు తరువాత జొన్న, మొక్కజొన్న, మినుము, పెసర పంటలను సాగు చేస్తారు. ఈ ఏడాది ఇప్పటికే 60 శాతానికిపైగా విస్తీర్ణంలో వరికోతలు పూర్తయినా ఇంకా చాలా మంది రైతులు రబీ సాగు ప్రారంభించలేదు. పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో ఏ పంట వేయకుండా ఖాళీగా ఉన్న భూముల్లో రైతులు ఆరుతడి పంటలను సాగు చేస్తారని భావించినా ఆశించిన స్థాయిలో రబీ సాగు జరగలేదు.

గుంటూరు జిల్లా పరిధిలో రబీ సాగుకు సంబంధించి 1.80 లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా ఇప్పటి వరకు 46 వేల ఎకరాల్లోనే సాగు జరిగింది. 2500 ఎకరాలు వరి సాగు జరుగుతుందని అంచనా వేయగా కేవలం 250 ఎకరాల్లోనే వేశారు. 55 వేల ఎకరాల్లో జొన్న సాగు చేస్తారని భావించగా కేవలం 5 వేల ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న 51 వేల ఎకరాలకు గాను కేవలం 14 వేల ఎకరాల్లోనే వేశారు. ముతక ధాన్యాలు లక్ష ఎకరాల్లో

▶ 2లో

ఇల్లే లేదు.. మూడు కరెంటు మీటర్లంట!

- వృద్ధురాలికి పింఛను నిలిపేస్తున్నట్లు చెప్పిన వాలంటీర్
- బతుకుదెరువు మీద దెబ్బకొట్టొద్దని బాధితురాలి వేడుకోలు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

ఉండేందుకు సొంత ఇల్లే లేదు. మూడు విద్యుత్తు మీటర్లు తన పేరుతో ఉన్నాయంటూ సామాజిక పింఛను నిలిపేస్తామంటూ సచివాలయ వాలంటీర్ చెప్పటంతో ఓ వృద్ధురాలు అవాక్కయ్యారు. కుంచనపల్లిలో శనివారం చోటుచేసుకున్న ఘటనపై వివరాల ప్రకారం.. గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన నల్లపు సౌభాగ్యం తన భర్త నల్లపు ఇశ్రాయేలు



బాధిత వృద్ధురాలు

2007లో అనారోగ్యంతో చనిపోయారు. అప్పటి నుండి ఆమెకు వితంతు పింఛను వస్తోంది. ఈ క్రమంలో ఉన్నట్టుండి గ్రామ

▶ 2లో

మురళీమోహన్, జయచిత్రకు ఎన్‌టిఆర్ పురస్కారం

ఆలోచనలకు ఆలంబన తెనాలి : మాజీ ఉపరాష్ట్రపతి

మెయిన్‌లో



గంజాయికి నిప్పు పెడుతున్న ఐజి త్రివిక్రమవర్మ

గుట్టలగుట్టల గంజాయి దహనం

గంజాయి రహిత రాష్ట్రం కోసమే ఆపరేషన్ పరివర్తన : డిఐజి త్రివిక్రవర్మ

ప్రజాశక్తి -మేడికొండూరు

ఆపరేషన్ పరివర్తనలో భాగంగా గంజాయి రవాణా, వినియోగంపై నిరంతర నిఘా కొనసాగుతుందని గుంటూరు రేంజి డిఐజి డాక్టర్ త్రివిక్ర వర్మ అన్నారు. మండలంలోని పేరేచర్ల కైలాసగిరి సమీపంలోని పోలీస్ ఫైరింగ్ రేంజ్ సమీపంలో శనివారం పోలీసు

▶ 2లో



ఘనంగా రాయపాటి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మాజీ ఎమ్.ఎల్.సి. రాయపాటి శ్రీనివాస్ 75 వ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం ఆయన నివాసంలో వేడుకలు ఘనంగా జరిగాయి. రాయపాటి శ్రీనివాస్, మాజీ ఎం.పి. రాయపాటి సాంబశివరావు ఇరువురు కేక్ కట్ చేశారు. రాయపాటి కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టి.డి.పి.నగర అధ్యక్షులు డేగల ప్రభాకర్, టిడిపి నాయకులు కోవెలమూడి రవీంద్ర, కనపర్తి శ్రీనివాస్ , కుర్రా అప్పారావు , తట్టుకోళ్ల కేశవ యాదవ్, కార్పొరేటర్లు శ్రీరాం ప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, బాలాజీ, టి.డి.పి. నాయకులు రాజ వర్ధన్, కిలారి భాస్కర్, జనసేన నాయకులు బోన బోయిన శ్రీనివాస్ యాదవ్, మాదా రాధా, బి.జె.పి. నాయకులు చందు సాంబశివరావు, భాష్యం విద్యా సంస్థల అధినేత భాష్యం రామకృష్ణ, మాజీ ఉడా చైర్మెన్ వణుకూరి శ్రీనివాస్ రెడ్డి, ప్రజా నాట్యమండలి నాయకులు ప్రముఖ గాయకులు ఘనీ, డా:మండవ శ్రీనివాస్, టి.వి.రాజా సిద్దార్ధ , రాష్ట్ర ఉద్యోగుల సంఘ నాయకులు బండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. షిరిడి సాయి దీన జన సేవా సమితి లో రాజ పుత్ర సత్యం సింగ్ ఆధ్వర్యంలో అంధ విద్యార్థులకు పండ్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

చర్చి పరిసరాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు

నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు

ప్రజాశక్తి - గుంటూరు

క్రిస్మస్ సందర్భంగా చర్చి పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య పనులు నిర్వహించాలని ప్రజారోగ్యాధికారుల్ని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు ఆదేశించారు. శనివారం లాడ్జి సెంటర్‌లోని సెయింట్ మాథ్యూస్ నార్త్ పారిష్ చర్చి, మార్కెట్ సెంటర్‌లోని వెస్ట్ పారిష్ చర్చి, పాత గుంటూరులోని పరిశుద మత్తయి తూర్పు మండలం చర్చి, రింగ్ రోడ్డు వద్దగల డాన్ బోస్కో, పొన్నూరు రోడ్డులోని లూథరన్ కమ్యూనిటీ ప్రేయర్ హాల్, వసంతరాయపురంలోని లూర్దు మాత దేవాలయం తదితర చర్చి ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనులు తనిఖీ చేసి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. చర్చిల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ నిర్వహించాలన్నారు. పర్యటనలో కార్పొరేటర్ బోడపాటి ఉషారాణి కిషోర్‌కుమార్, ధూపాటి వంశీబాబు పాల్గొన్నారు.



కొనకంచివారిపాలెంలో 104 ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - రొంపిచర్ల

మండలంలో కొనకంచివారిపాలెం గ్రామం లో శనివారం 104 ఉచిత వైద్యశిబిరము నిర్వహించటం జరిగింది. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డా.స్వాతి పాల్గొని వైద్యసేవలు అందించారు. ఆ గ్రామంలో 60 మందికి జలుబు, దగ్గు, జ్వరము వంటి సాధారణ జబ్బులకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితముగా మందులు పంపిణీ చేశారు. అవసరమైన వారికి ఉచితంగా బిపి, షుగర్ పరీక్షలు, రక్తపరీక్షలు నిర్వహించారు.గ్రామంలో ఇంటింటికి వెళ్లి గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు, పక్షవాతం ఉన్న వారికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి వివరించారు. కార్యక్రమంలో సిహెచ్ ఓ చంద్రశేఖర్, హెల్త్ సూపర్ వైజర్ రామయ్య, హెల్త్ అసిస్టెంట్లు రాము, కిరణ్ కుమార్, సురేష్, గ్రామ సచివాలయ హెల్త్ అసిస్టెంట్ జె.రాజ్యలక్ష్మి, ఎంపిహెచ్ పి ఝాన్సీ రాణి, ఎఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కోత యంత్రాలు



- యంత్రాల పోకడతో పనులు కోల్పోయిన కూలీలు
- పండుగ వేళా తప్పని ఆర్థిక ఇబ్బందులు

ప్రజాశక్తి-తెనాలి

ఖరీఫ్ సీజన్‌లో నవంబర్, డిసింబర్ నెలల్లో వ్యవసాయ కూలీలకు ఒకప్పుడు పండుగే. ఎందుకంటే వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉంటాయి. 'ఆడుతు పాడుతు పనిచేస్తుంటే అలుపూ సొలుపేమున్నదీ' అన్న రీతిన ఓ ఇంట్లో దంపతులిద్దరూ పనికి వెళితే సాయంత్రానికి రూ.1000కి తగ్గకుండా సంపాదించేవారు. ఈ రెండు నెలల్లో సంపాదనే పొదుపుకుగాని, క్రిస్మస్, సంక్రాంతి వేడుకలకుగాని దోహదపడేవి. అయితే ప్రస్తుతం వ్యవసాయంలో యంత్రాల ప్రాధాన్యత పెరిగిపోవటంతో వ్యవసాయ కూలీలకు పనులు దక్కని పరిస్థితి. ప్రత్యామ్నాయం కూడా లేక పండుగ వేళ దిగాలు పడుతున్నారు.

వ్యవసాయంలో రోజురోజుకూ యంత్రాల పోకడ పెరిగిపోయింది. దాదాపు 95 శాతం రైతులు యంత్రాలకే ప్రాధాన్యతనిస్తున్నారు. డెల్టాపరిధిలో దాదాపు ఆరున్నర లక్షల ఎకరాల్లో ఖరీఫ్‌లో వరి సాగు ఉంటుంది. ఖరీఫ్ సాగు ప్రారంభమైందంటే వ్యవసాయ కూలీల్లో సందడే సందడి. రోజువారి కూలికి వెళ్ళడం, పుష్కలంగా డబ్బులు సంపాదించుకోవటం పరిపాటి. ఒక్క వేసవిలో మినహా మిగిలిన ఖరీఫ్, రబీ సీజన్లలో కూలీలకు మంచి ఉపాధి లభించేంది. ముఖ్యంగా వరి సాగు అంటే మొదట దుక్కులు దున్నడం, పారపనులు, నారుమడులు పోయటం, నారు పీకటం వరకూ పురుషులకు చేతినిండా పని ఉండేది. అలాగే స్త్రీల విషయానికి వస్తే నాట్లు వేయంటం, కలుపు తీయటం, కోతలు కోయటం వంటి పనులుండేవి. అలాగే కుప్పలు వేయటం, కుప్ప నూర్పిడి వంటివి పురుషులు చేసేవారు. కాలగమనంలో స్త్రీపురుషులు బేదం లేకుండా అన్ని పనుల్లోనూ భాగస్వాములయ్యారు. ఒక ఇంట్లో భార్యా భర్తలు కూలికి వెళితే కనీసం రోజుకు రూ.800 నుంచి రూ.1000 వరకూ సంపాదించుకునేవారు.

యంత్రాల పోకడతో మారిని పరిస్థితులు..

గతంతో పోల్చితే వ్యవసాయంలో ఆధునిక పోకడలు సంతరించుకున్నాయి. యంత్రాల వినియోగం పెరిగిపోయింది. దుక్కులు దున్నటం ట్రాక్టర్లే..వరి సాగు ఎద పద్ధతిలోనే. ఇక వరి కోతకు యంత్రాలున్నాయి. ఒకే సమయంలో కోత, అదే సమయంలో నూర్పిడి కూడా. గంటకు ఎకరం చొప్పున యంత్రం కోత, నూర్పిడి పూర్తి చేస్తుంది. కేవలం రూ.2500 నుంచి రూ.2800లోపు ఖర్చు చేస్తే ఎకరంలో కోత, నూర్పిడి పూర్తవుతోంది. గతంలో కూలీలు చేసే పని ప్రస్తుతం యంత్రాలు చేయటం ద్వారా కొద్దిగా రైతుకు ప్రయోజనం చేకూరుతుందన్న భావనలో ఉన్నారు.

యంత్రాల పనిలో నష్టం కూడా ఉంది

యంత్రాల ద్వారా వరి కోతలు రైతులకు కొంత నష్టం కూడా ఉంది. యంత్రంతో కోత కోస్తే వరి గడ్డి పనికి రాదు. ప్రస్తుతం ఎండుగడ్డికి ఉన్న డిమాండ్ తెలియంది కాడు. ఎకరాకు కనీసం రూ.5 నుంచి రూ.6వేల వరకూ ఆదాయం ఉంటుంది. అది నష్టపోయినట్టే. పైగా కోత సమయంలోనే నూర్పిడి పూర్తిచేయటం ద్వారా గింజ ఆరదు. దానిని తేమ కింద పరిగణించి తూకంలోనూ నష్టపోతారు. ధరలోనూ వ్యత్యాసం ఉంటుంది, మొత్తం మీద బస్తాకు రూ.200 నుంచి రూ.300 వరకూ నష్టం ఉంటుంది. అయినప్పటికీ ఒక్కరోజులో కోత, నూర్పిడి పూర్తవుతుందన్న భావనతో రైతులు మొగ్గు చూపుతున్నారు. ఈ పరిస్థితుల మధ్య కూలీలు తీవ్రంగా నష్టపోతున్నారు.

నాలుగేళ్లుగా వ్యవసాయ పనుల్లేవు

ఎం.హేమలత, వ్యవసాయ కూలి, కొలకలూరు



ప్రతి ఏట జూన్‌లో పొలం పనులు ప్రారంభమైతే డిసింబర్ వరకూ కూలీ పనులుండేవి, నాట్లు, కలుపుతీయంటం, కోతలు కోటయం వంటి పనులు ముమ్మరంగా ఉండేవి. ప్రస్తుతం నాటు వేసే పనిలేదు, కోత కోసే పనిలేదు. యంత్రాలు వచ్చేశాయి. కూలీ పనులే ఆధారంగా జీవించే మాలాటి వారికి పనుల్లేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ప్రత్యామ్నాయం కూడా లేదు. విదిలేని పిరిస్థితుల్లో మిర్చి తొడిమలు తీసేందుకు మైళ్ళకొద్దీ వెళ్ళాల్సి వస్తోంది. అక్కడ వచ్చే కూలి రవాణా ఖర్చులకే చాలదు.

గుట్టలగుట్టల గంజాయి దహనం

(మొదటి పేజీ తరువాయి)



ఉన్నతాధికారుల సమక్షంలో గంజాయిని పెద్ద మొత్తంలో దహనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఐజి డాక్టర్ త్రివిక్రవర్మ వివరాలు వెల్లడించారు. గంజాయి సాగు, రవాణా నిర్మూలనకు పోలీస్ డిపార్ట్మెంట్ ఉక్కు పాదం మోపిందని తెలిపారు. అందులో భాగంగా 146 కేసులలో, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు జిల్లాలల్లో పట్టుబడ్డ 10,424,306 కిలోల గంజాయిని తగలబెట్టినట్లు తెలిపారు. కాల్చివేసిన గంజాయి విలువ రూ.4 కోట్ల వరకు ఉంటుందన్నారు. గుంటూరు రేంజ్ పరిధిలో 215 మందిపై కేసులు నమోదు చేశామన్నారు. గంజాయి మత్తులో యువత బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎస్పీలు ఆరీఫ్ హాఫిజ్, రవిశంకర్‌రెడ్డి, వకుల్ జిందాల్, మల్లికా గార్గ్, గుంటూరు రేంజ్ పరిధిలోని అన్ని జిల్లాల సీనియర్ పోలీస్ అధికారులు, రెవిన్యూ, ఎక్సైజ్, సెబ్, అధికారులు పాల్గొన్నారు.

ఇల్లే లేదు.. మూడు కరెంటు మీటర్లంట!

(మొదటి పేజీ తరువాయి)

వాలంటీర్ సౌభాగ్యానికి పెన్షన్ నిలిపేస్తామంటూ చెప్పడంతో తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఆర్థిక ఇబ్బందులతో ఇల్లు అమ్ముకున్న సౌభాగ్యం, ప్రస్తుతం గ్రామంలోని ఎంపీయుపి స్కూల్ వెనుక భాగంలో అద్దె ఇంట్లో ఉంటున్న తన కుమార్తె వద్ద ఉంటోంది. ఇటీవల అనారోగ్యానికి గురై, ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతోంది. తన భర్త పేరుతో ఉన్న ఇల్లు అమ్మికోగా, మరో రెండు కొత్త పేర్లు తన ఆధార్ కార్డుకు లింక్ అయ్యాయని వాలంటీర్ చెబుతున్నారని, ఇదెక్కడి విడ్డూరమని బాధిత వృద్ధురాలు ప్రశ్నిస్తోంది. తన బతుకుదెరువుకు ఆధారమైన పింఛను నిలిపేయొద్దని వేడుకుంటోంది.

రబీ సాగు మందగమనం

(మొదటి పేజీ తరువాయి)

సాగు చేస్తారని అంచనా వేయగా కేవలం 8 వేల ఎకరాల్లోనే వేశారు. 25 వేల ఎకరాల్లో శనగ పంట వేయాల్సి ఉండగా 10 వేల ఎకరాల్లో, పెసర 25 వేల ఎకరాలకు గాను మూడు వేల ఎకరాల్లో, మినుము 16 వేల ఎకరాలకు గాను 6 వేల ఎకరాల్లో వేశారు.

పల్నాడు జిల్లాలో 1.38 లక్షల ఎకరాల్లో పంటలను సాగు చేస్తారని అంచనా వేయగా ఇప్పటి వరకు 74 వేల ఎకరాల్లో రబీ సాగైంది. 65 వేల ఎకరాల్లో వరి సాగు జరగాల్సి ఉండగా 6500 ఎకరాల్లోనే వేశారు. జొన్న సాగు 7 వేల ఎకరాల్లో చేస్తారని అంచనా వేయగా కేవలం 2 వేల ఎకరాల్లోనే వేశారు. మొక్కజొన్న 20 వేల ఎకరాలకు గాను 25 వేల ఎకరాల్లో సాగైంది. ముతక ధాన్యాలు 22 వేల ఎకరాల్లో సాగు చేస్తారని భావించగా 25 వేల ఎకరాల్లో వేశారు. శనగ పంట 30 వేల ఎకరాలకు గాను 15 వేల ఎకరాలు, పెసర 1500 ఎకరాలకు గాను కేవలం 50 ఎకరాల్లో, మినుము ఐదు వేల ఎకరాలకు గాను 500 ఎకరాల్లో సాగు చేశారు.

ఇటీవల సంభవించిన మాండూస్ తుపాను వల్ల రెండు జిల్లాల పరిధిలో కొన్ని మండలాల్లో రబీ పంటలకు ఆదిలోనే కోలుకోని దెబ్బతగిలింది. అధిక వర్షాలతో ఉరకెత్తి మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న దెబ్బతిన్నాయి. అంతేగాకుండా గత ఏడాది శనగ ధరలు ఆశాజనకంగా లేకపోవడం వల్ల ఈ ఏడాది శనగ సాగుకు రైతులు పూర్తిస్థాయిలో ఆసక్తి చూపడం లేదు. పల్నాడు జిల్లాలో ఖరీఫ్‌లో 80 వేల ఎకరాల్లో ఏ పంటా వేయకుండా ఖాళీగా ఉంచారు. ఈ భూముల్లో శనగ, జొన్న, మొక్కజొన్న సాగు చేస్తారని భావించినా రైతులు ఆసక్తి చూపలేదు. ప్రధానంగా కౌలు రైతులు ముందుకు రాకపోవడం, భూ యజమానులు ధైర్యం చేసి సాగు చేయకపోవడంతో దాదాపు 75 వేల ఎకరాల్లో భూములు ఇప్పటికీ ఖాళీగానే ఉన్నాయి. ఖరీఫ్‌లో గుంటూరు జిల్లాలో 50 వేల ఎకరాల్లో ఏ పంట వేయకుండా రైతులు భూములు ఖాళీగా ఉంచారు. అయితే రబీలో ముందస్తుగా వేయాల్సిన పంటలను కూడా వేయలేదు. అధికారులు నిర్దేశించుకున్న లక్ష్యంలో పల్నాడు జిల్లాలో కొంత ఆశాజనకంగా ఉండగా గుంటూరు జిల్లాలో మాత్రం 25 శాతం భూముల్లోనే సాగైంది.

అనారోగ్య సమస్యలతో ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి - దుగ్గిరాల

అనారోగ్యంతో వచ్చే సమస్యలను తట్టుకోలేక.. ఇతరులపై ఆధారపడ్డం ఇష్టం లేక వ్యవసాయ కూలీ ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చిలువూరులో శనివారం చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం (56)కు భార్య, ముగ్గురు కుమార్తెలున్నారు. ముగ్గురు కుమార్తెలకూ వివాహం చేశాడు. అనంతరం దంపతులిద్దరూ కూలి పనులు చేసుకుని జీవిస్తున్నారు. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో తెనాలిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాడు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు గుండె కవాటాల్లో ఇబ్బంది ఉందని ఆపరేషన్ అవసరమని చెప్పారు. దీంతో మంగళగిరిలోని ఎన్ఆర్ఐలో ఆపరేషన్ చేయించుకున్నాడు. అప్పటి నుండి పనులు సరిగా చేయలేకపోతున్నాడు. పైగా ఆస్తులేమీ లేకపోవడంతో కుటుంబమూ గడవడం కష్టమైంది. ఈ నేపథ్యంలో ఇటీవలే ఒక కుమార్తె వద్ద రెండు నెలలు ఉండి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం మళ్లీ దెబ్బతినడంతో మరోసారి ఆపరేషన్ అవసరమని వైద్యులు చెప్పారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మందుతాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబీకులు తెనాలి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్సానంతరం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించాగా శనివారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు దుగ్గిరాల ఎస్ఐ సత్తార్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించారు.

కడుపు నొప్పి తాళ్ల లేక విద్యార్థి ఆత్మహత్య

కడుపు నొప్పి తాళలేక విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని పెదకొండూరులో శనివారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గుంటూరు వంశీ (19) విజయవాడలో డిగ్రీ చదువుతున్నాడు. కడుపు నొప్పితో బాధపడుతున్న వంశీ గురువారం పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా ప్రాథమిక వైద్యం అనంతరం గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటి నుండి చికిత్స పొందుతున్న వంశీ శనివారం మృతి చెందాడు. దుగ్గిరాల పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.



విత్తనాలు నాటుతున్న డ్వామా పీడీ తదితరులు

లక్ష విత్తనాలు నాటిన అధికారులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

మండలంలోని పెదపాలెం హైస్కూల్లో విత్తనాలు నాటే కార్యక్రమాన్ని డ్వామా పీడీ యుగంధర్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. హైస్కూల్ ఆవరణలోని ఎకరం స్థలంలో నర్సరీ ఇప్పటికే ప్రారంభించగా వేప, చింత, ఉసిరి, గానుగా, బాదం, బహున్యా, రావి, కబిబా, రోస్ సహా మొత్తం 11 రకాలకు సంబంధించి లక్ష విత్తనాలు ప్యాకెట్లలో నాటారు. ఇవి మొలకెత్తిన తర్వాత మొక్కలను ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తారని ఎంపిడిఓ కుసుమ శ్రీదేవి తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, ఉపాధి హామీ ఏపీవో మధుబాల పాల్గొన్నారు.

ముమ్మరంగా రబీ పనులు

ప్రజాశక్తి - దుగ్గిరాల

ఖరీఫ్ పంట చేతికందిన వెంటనే రైతులు రబీ సాగుకు శ్రీకారం చుట్టారు. దుగ్గిరాల - ఈమని గ్రామాల మధ్య ఉన్న పొలాల్లో పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండూస్ తుపానుకు ముందు దుగ్గిరాల దక్షిణ పొలాల్లో రైతులు నాటిన మొక్కజొన్న విత్తనాలు కుళ్లిపోవటంతో తిరిగి రెండోసారి విత్తటానికి సన్నద్ధమవుతున్నారు. గతేడాది మొక్కజొన్న ధరలు ఆశాజనకంగా ఉండటంతో ఈ సంవత్సరం సాగు కూడా పెరిగే అవకాశాలున్నాయి. మినప పంట దిగుబడి తగ్గటం మొక్కజొన్న సాగు పెరగడానికి మరో కారణంగా తెలుస్తోంది. మండల వ్యాప్తంగా ఉన్న 22 వేల ఎకరాల్లో గతేడాది 18 వేల ఎకరాల్లో మొక్కజొన్న జొన్న సాగు చేయగా 4 వేల ఎకరాల్లో మినుము పెసర సాగు చేశారు. ఈ ఏడాది మొక్కజొన్న సాగు మరో రెండు వేల ఎకరాలు పెరిగే అవకాశాలున్నాయి.



మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న కూలీలు

దంపతులపై మద్యం మత్తులో దాడి

ప్రజాశక్తి - తాడేపల్లి

మద్యం మత్తులో దంపతులను వేధించిన ముగ్గుర్ని స్థానికులు పోలీసులకు అప్పగించారు. తాడేపల్లిలోని ముగ్గురోడ్డు సమీపంలో శనివారం రాత్రి చోటుచేసుకున్న ఘటనపై స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం.. మంగళగిరి మండలం నవులూరుకు చెందిన దంపతులు విజయవాడలో నిర్వహించిన సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం ద్విచక్ర వాహనంపై తిరిగి వస్తుండగా 8.30 గంటల సమయంలో తాడేపల్లిలోని ముగ్గు రోడ్డు వద్ద మద్యం మత్తులో ఉన్న ఎ.ప్రసన్నకుమార్, జి.రూబెన్, బాబు కలిసి మరో ద్విచక్ర వాహనంపై వెంబడించి అడ్డుకున్నారు. బంగారం, నగదు ఇవ్వాలని బెదిరించడంతోపాటు దాడికి పాల్పడ్డారు. ఈ క్రమంలో స్థానికులు కలుగచేసుకుని వారించారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు.



పోస్టర్లు విడుదల చేస్తున్న వంశీ, నాగేశ్వరరావు, గోపాలకృష్ణ తదితరులు

రేపు ఉచిత వైద్యశిబిరం

25 మంది వైద్యనిపుణులతో 2 వేల మందికి ఏర్పాటు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

తానా, గ్రేస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల 27న గుంటూరు ఎసి కళాశాలలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తామని ఫౌండేషన్ ప్రతినిధి కోట వంశీ, డాక్టర్ యర్రా నాగేశ్వరరావు, ఆర్.గోపాలకృష్ణ, గోరంట్ల పున్నయ్య చౌదరి, రవిచంద్ర తెలిపారు. గుంటూరులోని ఒక హోటల్లో శనివారం సాయంత్రం జరిగిన మీడియా ప్రతినిధుల సమావేశంలో వారు వివరాలు వెల్లడించారు. 25 మంది ప్రముఖ వైద్య నిపుణులతో పేదలకు పరీక్షలు, చికిత్సలు, శస్త్ర చికిత్సలు ఉచితంగా నిర్వహించేందుకు వీలుగా ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శిబిరంలో ఉచిత రక్త పరీక్షలు, ఎక్సరే, స్కానింగ్ పరీక్షలు మందులు కూడా పంపిణీ చేస్తామని తెలిపారు. రోగనిర్ధారణ కోసం వచ్చేవారు ఆధార్ కార్డ్ తప్పని సరిగా తీసుకురావాలన్నారు. మందుల కొనుగోలు నిమిత్తం రూ.25 లక్షలు వెచ్చించినట్లు తెలిపారు. వైద్య శిబిరాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.రామకష్ణ, పొగాకు బోర్డు ఎగ్జిక్యూటివ్ డైరక్టరు అద్దంకి శ్రీధర్ ప్రారంభిస్తారని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అన్నదాన సమాజం అభివృద్ధిపై దృష్టి

మాస్టర్ ప్లాన్ పరిశీలించిన ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. ఈ మేరకు దేవాదాయ శాఖ ప్రత్యేకంగా రూపొందించిన మాస్టర్ ప్లాన్‌పై డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, అన్నదాన సమాజం పాలకమండలి ఛైర్మన్ పోకల వసంత్, ఈవో ప్రమీలారాణితో శనివారం సమావేశమయ్యారు. మాస్టర్ ప్లాన్‌లో పొందుపరచిన అంశాలపై చర్చించి దాని అమలు సాధ్యాసాధ్యాలు, అవసరమైన అనుమతులపై సమీక్షించారు. మాస్టర్‌ప్లాన్‌లో కొన్ని మార్పులు, చేర్పులు సూచించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజంలో నిరాదరణకు గురయ్యే వితంతువుల గురించి స్వాతంత్ర్యానికి పూర్వమే ఆలోచన చేసి, వారికి గౌరవప్రదంగా అన్నవసతులు ఏర్పాటు చేయాలనే ఆశయంతో అన్నదాన సమాజాన్ని దేశభక్త కొండా వెంకటప్పయ్య పంతులు స్థాపించారని చెప్పారు. వితంతువుల కోసం ప్రత్యేకంగా నిర్మించిన గృహ సముదాయం పూర్తిగా శిథిలమై నివాసయోగ్యంగా లేదని, వర్షపు నీరు కూడా లోపలికి వస్తుండడం వలన అనేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. దీనిపై సీరియస్‌గా దృష్టి సారించినట్లు చెప్పారు.



వినుకొండ సబ్ జైల్ ను తనిఖీ చేసిన జడ్జి

నేరాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి - వినుకొండ

జూనియర్ సివిల్ జడ్జి ఎ.తౌషిద్ హుస్సేన్ శనివారం సబ్ జైలును సందర్శించి, ఖైదీలతో సమావేశం నిర్వహించారు. ఖైదీల సమస్యలను, వారి ఆరోగ్య పరిస్థితులను, జైలులో భోజన సదుపాయాలు గురించి అడిగి తెలుసుకున్నారు. జైలులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలియజేయాలని అన్నారు. మెనూను పరిశీలించారు. వైద్యం, భోజనం తదితర విషయాల గురించి ఖైదీలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. జైలు నుంచి విడదల అయిన తర్వా ఖైదీ లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు దూరంగా ఉండాలని, సమాజంలో మంచి పౌరు లుగా జీవించాలని చెప్పారు. వంట గది, స్టోర్ రూమ్, వండిన ఆహారంను ఆయన తనిఖీ చేసి తగు సూచనలు చేసినారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకోలేని వారికి న్యాయవాదిని నియమిస్తామన్నారు. అనంతరం జైలు గార్డెన్‌ను, ప్రాంగణమును పరిశీలించి తగు సూచనలు చేశారు. న్యాయమూర్తి తో పాటు బార్ అసోసియేషన్ కోశాధికారి పివి రమణారెడ్డి, కె.చెన్నకేసేవరెడ్డి, పి.గౌస్ మొహిద్దీన్‌ఖాన్, టి.ఆంజనేయులు,వి. శివశంకర్‌బాబు, ఎన్.రమణారావు, వార్డెన్ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



ప్రజాశక్తి కేలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎన్ గోపిరెడ్డి, కిరీట్ రెడ్డి, ఫాదర్ తమ్మి

ప్రజాస్వామ్యంలో పత్రికలది ప్రధాన భూమిక

వైసిపి నాయకులు ఎస్.గోపిరెడ్డి

ప్రజాశక్తి - విజయపురిసౌత్

భారతదేశంలో ప్రజాస్వామ్యం సజావుగా ఉండేందుకు పత్రికలు చేస్తున్న కృషి అభినందనీయమని వైసిపి సీనియర్ నాయకులు, మాజీ జడ్పిటిసి ఎస్.గోపిరెడ్డి అన్నారు. స్థానిక మాతా సరోవర్ రిసార్ట్సులో 2023 నూతన సంవత్సర ప్రజాశక్తి కేలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని కష్టాలైనా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొనైనా పత్రికలు వాస్తవాలను వెలికితీసేందుకు కృషి చేయాలని కోరారు. మరో ముఖ్యఅతిథి యుటిఎఫ్ సీనియర్ నాయకులు కిరీట్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాశక్తి ఓ ప్రత్యామ్నాయ వేదిక అని, ప్రజల గొంతుకు వినిపించే పత్రిక అని కొనియాడారు. కార్యక్రమంలో సాగర్ మాత మందిరం ఫాదర్ అన్నెం. తమ్మి తదితరులు పాల్గొన్నారు

ముప్పాళ్లలో వరికోత పంట ప్రయోగం

ప్రజాశక్తి - ముప్పాళ్ల

వైఎస్సార్ ఉచిత పంటల బీమా,ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో భాగంగా మండల కేంద్రంలోని ముప్పాళ్లలో శనివారం వరిలో పంట కోత ప్రయోగం కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయశాఖ, ఎస్‌బిఐ జనరల్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో ఈ ప్రయోగం నిర్వహించారు. ముప్పాళ్ల గ్రామ పంచాయతి కొంకావారిపాలెంకు చెందిన రైతు దారా నరసింహారావు కౌలు వేసిన వరి పొలంలో పంట నూర్పుగా ఎకరానికి సుమారు 33 బస్తాల దిగుబడి (1 బస్తా 75 కేజీల వరకు) వచ్చింది. ఈ పంట కోత ప్రయోగాన్ని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయం నుంచి ఎఎస్ఓ టి.మధుసూదన్ పర్యవేక్షించారు.

బాధిత కుటుంబానికి చెక్కు ఇవ్వండి

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

వినాయక రెస్టారెంట్ లో డ్రైనేజీ శుభ్రం చేసేందుకు వెళ్లి మృతి చెందిన తురగ అనిల్ కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.5 లక్షల చెక్కును అందజేయాలని సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్డిఒ కార్యాలయంల సూపరింటెండెంట్ మస్తాన్‌కు, తహశీల్దార్ కె.నగేష్‌లకు సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు శనివారం వినతి పత్రం సమర్పించారు. ఆర్థిక సహాయంలో రూ.2.50 లక్షలు మున్సిపల్ చైర్మన్ భర్త చల్లంచర్ల సాంబశివరావు ఇవ్వాలని డిమాండ్ చేసిన విషయాన్ని మంత్రి అంబటి రాంబాబుకు చెప్పేందుకు వెళ్ళిన బాధితులతో కచ్చితంగా డబ్బులు ఇవ్వాల్సిందేనని ఆయన చెప్పటం దుర్మార్గమన్నారు. బాధితులకు చెక్కు అందచేసి సమగ్ర విచారణ చేపట్టాలని సిపిఎం నాయకులు అధికారులను డిమాండ్ చేశారు. సిపిఎం పట్టణ కార్యదర్శి ధరణికోట విమల, మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, ఐద్వా పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటుపల్లి రజని, భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.ప్రసాదరావు, చేనేత కార్మిక సంఘం నాయకులు కట్టా శివదుర్గారావు, ఎ.వీరబ్రహ్మం, పి.ప్రభాకర్, సిఐటియు నాయకులు ఆర్. పురుషోత్తం, ప్రజా నాట్యమండలి పట్టణ కార్యదర్శి పి.సూర్యప్రకాశరావు పాల్గొన్నారు.



తహశీల్దార్ కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

నిందితులకు టిడిపి నాయకుల ఆశ్రయం

- **ఎమ్మెల్యేగా నియోజకవర్గంలో తిరిగే హక్కు నాకుంది**
- **ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి**



ప్రజాశక్తి - మాచర్ల

ఇటీవల మాచర్లలో జరిగిన దాడులలో నిందితులకు తెలుగుదేశం పార్టీ నాయకులు ఆశ్రయం కల్పించారని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఉదయం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా మాచర్ల నియోజకవర్గంలో తింగటం తన హక్కు అని అన్నారు. ప్రశాంతంగా ఉన్న మాచర్లలో రాజకీయ లబ్ది కోసం టిడిపి నాయకులు 'చలో మాచర్ల'కు పిలుపనిచ్చి, ఇక్కడ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. టిడిపి ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి వారి కార్యకర్తలను రెచ్చగొట్టి హింసను ప్రోత్సహించారని ఆరోపించారు. ఈ నెల 16న టిడిపి నాయకులు జరిపిన దాడిలో ఇప్పటికీ తమ పార్టీకి చెందిన ముగ్గురు బిసి నాయకులు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని అన్నారు. తాను,తన కుటుంబం మాచర్లలో ఉంటూ తన రాజకీయ వ్యవహారాలన్నీ ఇక్కడి నుండే చేస్తున్నందున ప్రజలు తనను ఆదరిస్తున్నారన్నారు. ప్రశాంతంగా ఉన్న మాచర్ల నియోజకవర్గంలో హింసను ప్రోత్సహించవద్దని టిడిపి నాయకులకు హితవు పలికారు.

నటుడు సత్యనారాయణకు నివాళి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

నవరస నటనా సార్వభౌముడు కైకాల సత్యనారాయణ మృతి చలన చిత్ర పరిశ్రమకు, రాజకీయాలకు తీరని లోటని సిపిఎం పట్టణ కార్యదర్శి పేరుబోయిన వెంకటేశ్వర్లు శనివారం అన్నారు. స్థానిక పండరీపురంలోని ప్రజాసంఘాల కార్యాలయంలో నివాళులర్పించారు. సత్యనారాయణ కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గర్భిణిలకు కౌన్సిలింగ్ కార్డులు

- **జిల్లాలో ప్రారంభించాం**
- **జిల్లా వైద్యాధికారి శోభారాణి**

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గర్భిణిలకు కౌన్సిలింగ్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని పల్నాడు జిల్లాలో శనివారం ప్రారంభించినట్లు జిల్లా వైద్యాధికారి శోభారాణి తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఈ కార్డులు అందజేసే కార్యక్రమం ప్రారంభించినట్లు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా, ప్రతి అంగన్వాడీ కేంద్రము, అంగన్వాడీ కార్యకర్త, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు ఎఎన్సిల సందర్శనలో గర్భిణిలకు చేసే పరీక్షలు, వారికి అందించే సేవలు గురించి వివరించి చెబుతా మన్నారు.



గర్భంతో ఉన్న సమయంలో పది నుండి 12 కేజీల బరువు పెరగాల్సి ఉంటుందని, అందుకు పెరుగు దల పరీ క్షలు చేయ డం, విధిగా రక్తపోటు పరీక్షలు నిర్వహించి రక్తహీనత లేకుండా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో ఉన్న ప్రతి గర్భిణిని ఎఎన్ఎం, ఆశాలు, ఎన్సీల సహకారంతో ముందుగానే గుర్తించాలన్నారు. కౌన్సిలింగ్ కార్డుల ద్వారా తగిన సమాచారం ఇచ్చి వారిని సమీప ఏరియా ఆసుపత్రులకు తీసుకు వెళ్లి తగిన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా మాతాశిశు మరణాల రేటును తగ్గించేందుకు ఉపయోగపడుతుందన్నారు.

అర్హులందరికీ ఇళ్ల పట్టాలివ్వండి

జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గురజాల రెవిన్యూ డివిజన్ పరిధిలో అర్హులందరికీ ఇళ్ల స్థలాలు జనవరిలో పంపిణీ చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ శివ శంకర్ లోతేటి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ చాంబర్‌లో శనివారం గురజాల రెవిన్యూ డివిజన్ అధికారులతో సమావేశమయ్యారు. పిడుగురాళ్ల, దాచేపల్లి, గురజాల పరిధిలో ఇల్లు లేక దరఖాస్తులు చేసుకున్న అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇంటి స్థలాలు ఇవ్వాలని సూచించారు. మాడుగల పరిసర ప్రాంతాల్లో ఇంటి స్థలాల కోసం సుమారు 3000 మంది దరఖాస్తు చేసుకున్నారని నూతన ఏడాది స్థలాలు పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. గురజాల నియోజకవర్గం, మాడుగుల పరిధిలోని అంజనాపురం పరిధిలో 2 ఎకరాలు, తేలుకుట్లలో 2.03 ఎకరాలు, గుత్తికొండలో 5.80 ఎకరాలు, దాచేపల్లి పరిధిలో ని నాయుడు పేటలో 39.14 ఎకరాలు, పిడుగురాళ్ల మున్సిపల్ పరిధలోని స్వర్ణ పిచ్చయ్య కాలనీలో 40 ఎకరాలు, ఆదర్శ కాలనీలో 28 ఎకరాలను పేద ప్రజల కు ఇంటి నివాస స్థలాల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సూచించారు. అంజనాపురం పరిధిలో భూసేకరణను ఎకరానికి రూ.17.50 లక్షలు, తేలుకుట్లలో రూ.10.80 లక్షలు, గుత్తికొండలో ఎకరానికి రూ.12.60 లక్షలుగా ధరను నిర్ణయించి రైతుల నుంచి భూసేకరణ కార్యక్రమం వేగవంతం చేయాలని ఆదేశించారు. సమీక్షలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, జిల్లా రెవెన్యూ అధికారి వినాయకం, గురజాల రెవెన్యూ డివిజన్ అధికారి అద్దయ్య, పిడుగురాళ్ళ మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, దాచేపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, తహశీల్దార్ లు దానియేలు, చక్రవర్తి,సర్వయర్లు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గురజాల రెవిన్యూ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్. చిత్రంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

జగనన్న కాలనీలకు భూసేకరణ వేగవంతం చేయాలి

'జగనన్న పేదలందరకీ ఇల్లు" కాలనీల ఏర్పాటుకు జిల్లాలో భూసేకరణ వేగవంతం చేస్తున్నట్లు కలెక్టర్ శివ శంకర్ లో తేటి తెలిపారు. శనివారం మధ్యాహ్నం నరస రావు పేట మండలం ఇక్కుర్రు గ్రామ శివారులో ప్రభుత్వం భూసేకరణ కార్యక్రమంలో భాగంగా రైతుల నుంచి సేకరిస్తున్న భూములను ఆయన పరిశీలించారు. భూసేకరణ విషయంలో తీసు కోవాల్సిన జాగ్రత్తలను అధికారులకు సూచించారు. లబ్దిదారులందరికీ ఉపయోగ పడే భూములను త్వరితగతిన చేపట్టాలని ఆదేశించారు. నివాసాలకు ఆమోద యోగ్యమైన భూములను గుర్తించి, రైతులతో మాట్లాడి ఒప్పించాలన్నారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమం విజయవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నరసరావుపేట రెవెన్యూ అధికారి శేషిరెడ్డి, తహశీల్దార్ రమణానాయిక్, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, హౌసింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాలరావు పాల్గొన్నారు.



ప్రజాశక్తి
గుంటూరు 5
ఆదివారం 25 డిసెంబర్ 2022

పింఛన్లు, రేషన్ కార్డుల తొలగింపు ఉపసంహరించుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, ఒంటరి మహిళలు, ఇతర వృత్తుల వారికి ఇస్తున్న పెన్షన్లు 2023 జనవరి ఒకటో తేదీ నుండి కొన్ని తొలగించాలని ప్రభుత్వం చూస్తుందని ఈ నిర్ణయం వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ఎస్ చెంగయ్య, సిపిఎం పట్టణ కార్యదర్శి వై కమలాకర్, సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యుల వివి జవహర్లాల్, ఎం బాలాజీ, ఎస్ వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే లిస్టులో సచివాలయాలు వారిగా తయారు చేశారని, రద్దు చేసే వారికి నోటీసులు కూడా ఇచ్చినట్లుగా తెలిసిందని తెలిపారు. కరెంట్ బిల్లు ఎక్కువ వస్తుందని ఆధార్ కార్డుతో, ఆస్తులు పొలాలు, కార్లు ఉన్నట్లుగా ఆధార్ లింకు తెలియజేస్తుందని అందువలన రకరకాల కారణాలు చూపి తొలగించడానికి చర్యలు చేపట్టారని విమర్శించారు. సిపిఎం పార్టీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కొన్ని సచివాలయాల్లో సమాచారం సేకరించినట్లుగా తెలిపారు. ఒకటో వార్డు పరిధిలో 27 పెన్షన్లు, మూడో వార్డు పరిధిలో 33, 23వ వార్డు పరిధిలో 50 పెన్షన్లు రద్దు చేశారని వివరించారు. ఒక వార్డులో సుమారు 50 రేషన్ కార్డులు రద్దు అయినట్లుగా సమాచారం ఉందని తెలిపారు. ఈ రకంగా మంగళగిరి పట్టణంలో 500 పైగా పెన్షన్లు, వేయికి పైగా రేషన్ కార్డులు రద్దు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. దీంతో వద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలు, వితంతువులు, చేనేత కార్మికులు జీవితం ప్రశ్నార్ధికంగా మారిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వచ్చే నెల నుంచి 250 రూపాయలు పెంచుతున్నట్లు చెప్పి అసలుకే మోసం తెచ్చిందని విమర్శించారు. కుటుంబంలో పెద్ద కొడుకుగా జగన్ వద్ధులను ఆదుకుంటారని చెప్పి మోసం చేసి రోడ్డు మీదకు నెట్టడం సబబు కాదని అన్నారు. ఇప్పటికైనా కార్డులు, పెన్షన్లు రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం పట్టణ కమిటీ డిమాండ్ చేస్తుందని తెలిపారు. లేకపోతే బాధితుల్ని సమీకరించి పెద్ద ఎత్తున పోరాటం చేయాల్సి వస్తుందని తెలిపారు.

పేదల పింఛనుకు ఎసరు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

తాను అధికారంలోకి వస్తే పేదలకు ఇచ్చే పింఛను ప్రతి ఏటా పెంచుతానని వాగ్దానం చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేసి, పేదలను ఆదుకుంటామని చెప్పిన వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు కోత విధించే కార్యక్రమం మొదలుపెట్టింది. ఇప్పటివరకు వస్తున్న పింఛను, ఒక్కసారిగా నిలిపి వేస్తారని అధికారులు చెప్పడంతో పింఛన్దారులు లబోదిబో మంటున్నారు. ఇన్నాళ్లు తమకు ఇచ్చిన పింఛను 2023 జనవరి నుండి రూ.250 పెరుగుతుందని ఆశగా ఎదురుచూసిన పింఛనుదారు లకు, గ్రామ సచివాలయ వాలంటీర్లు వివిధ రకాల సాకులు చూపి, పింఛన్ నిలిపేస్తామంటూ పిడుగు లాంటి వార్తను చేరవేస్తున్నారు. విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటిందని, పింఛిన్దారుని కుటుంబ సభ్యులలో ఫోర్ వీలర్ ఉందని, అర్బన్ ప్రాపర్టీస్ క్రింద 1000 చదరపు అడుగులు ఇళ్లు నిర్మాణం ఉందని, పింఛన్ లబ్ధిదారుని కుటుంబంలో ఆదాయపు పన్ను చెల్లించేవారు ఉన్నారని, ఇలా అనేక కుంటి సాకులతో పింఛన్ కట్ చేసే కార్యక్రమం మొదలయ్యింది. ఇన్నాళ్లు వద్ధులకు ముందులకు, ఉదయం తీసుకునే అల్పాహారానికి ఖర్చు చేసుకునే పింఛను ఒక్కసారిగా ఆగిపోతుంది అంటే వద్ధులకు, ఇటు వితంతువులకు, ఒంటరి మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాడేపల్లి మండలంలోని కుంచనపల్లి గ్రామ సచివాలయ పరిధిలో 58 పింఛన్లు, వడ్డేశ్వరం 57, ఇప్పటం గ్రామ సచివాలయ పరిధిలో 146, కొలనుకొండలో 31 మంది పింఛన్దారులను వివిధ కారణాలతో తొలగించేందుకు గ్రామ సచివాలయ అధికారులు నిమగ్నమయ్యారు. ఇన్నాళ్లు లేని అడ్డంకి, 2023 జనవరి నుంచి పింఛన్ పెంపుదల చేసే సమయానికే ఎందుకు వచ్చిందని పలువురు వద్ధులు ఆవేదన చెందుతున్నారు.

ఆంక్షలు లేకుండా కొనసాగించాలి : సిపిఎం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలైన సంక్షేమ పథకాలను ఆంక్షలు లేకుండా కొనసాగించాలని సిపిఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తాడేపల్లి మండలంలోని వివిధ గ్రామాలలో సుమారు 500 మందికి వివిధ రకాల కారణాలతో పింఛన్లను నిలిపేసేందుకు గ్రామ సచివాలయ వాలంటీర్లు లబ్ధిదారులకు చెబుతున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే గ్రామీణ ప్రాంతాలలో విద్యుత్ వాడకం 300 యూనిట్లు దాటిందనే పేరుతో తెల్ల రేషన్ కార్డులతో సహా వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిలిపివేస్తామని అధికారులు చెప్పడం దుర్మార్గమన్నారు. ప్రభుత్వం ఎలాంటి ఆంక్షలు లేకుండా సంక్షేమ పథకాలను కొనసాగించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

ఏరివేతలో అధికారులు బిజీబిజీ

ప్రజాశక్తి-తాడేపల్లి



తాడేపల్లి పట్టణంలోని 15 సచివాలయాల్లో అధికారులు బిజీబిజీ అయిపోయారు. ఆయా సచివాలయాల పరిధిలోని సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు తగ్గింపునకు కసరత్తు మొదలుపెట్టారు. ఒక్కో సచివాలయంలో ఇప్పటిదాకా ప్రభుత్వం నుంచి లబ్ది పొందుతున్న 100 నుంచి 500 మంది వరకు సామాజిక పింఛన్లు, రేషన్ కార్డులు రద్దయ్యే పరిస్థితి ఏర్పడింది. ఇప్పటికే కొంత మంది పింఛనుదారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో కొత్త సంవత్సరం నుంచి ప్రభుత్వం ప్రకటించిన రూ.2750 పింఛను తమకు అందుతుందో లేదోనని ఆందోళన చెందుతున్నారు. అలాగే కేంద్ర ప్రభుత్వం ప్రటకించిన ఉచిత బియ్యం తమ కార్డులు రద్దయితే రావేమోనని ఆందోళన నెలకొంది. దీంతో శుక్ర, శనివారాల్లో సచివాలయాల చుట్టూ బాధితులు పెద్దఎత్తున ప్రదక్షిణలు చేశారు. కొందరు మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. అధికారులు మాత్రం నిబంధనల ప్రకారమే తాము నడుచుకుంటామని, అంతకు మించి తామేమీ చేయలేమని చెబుతున్నారు. దీంతో క్రిస్మస్, కొత్త సంవత్సరం అనందం చాలా మందికి దూరమయ్యే పరిస్థితి కనిపిస్తుంది.



నూతనంగా ఏర్పాటు చేసిన బోరు ప్రారంభిస్తున్న శ్రీ రమ్య

లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

ప్రజాశక్తి - ప్రత్తిపాడు

జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించని లబ్ధిదారులు త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీ రమ్య అన్నారు. ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా ప్రత్తిపాడు మండల పరిధిలోని తుమ్మలపాలెం జగనన్న కాలనీలో శనివారం ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్క లబ్ధిదారుడు సొంతింటి కల సహకారం చేసుకోవాలని కోరారు. హౌసింగ్ ఏఈ సురేష్ కుమార్ మాట్లాడుతూ కాలనీలో 100 శాతం నిర్మాణాలు పూర్తి చేయలన్నారు. అనంతరం జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు కార్యక్రమంలో ఎ పి ఎం సురేష్, పి అర్ ఎఈ కిషోర్, ఆర్డబ్ల్యూఎస్ ఎఈ వినీల్, పంచాయతీ కార్యదర్శి, వి అర్ ఒ, హనుమంతు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై సర్పంచ్ చొరవ

తుమ్మలపాలెం జగనన్న కాలనీలో లబ్ధిదారులు పలు రకల సమస్యలు తెలపడంతో సర్పంచ్ స్పందించి కాలనీలో వీధి లైట్స్, రోడ్లు, కాలనీ మొత్తనికి ఒక్కటే బోర్ ఉండటంతో మరో బోర్ వేయడం లాంటివి చేయడంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు.

ఇంజినీరింగ్ పూర్తి చేసేవారంతా సూపర్‌స్టార్లే

విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ విద్యార్థులతో యువ సినీ దర్శకులు అనిల్ రావిపూడి

ప్రజాశక్తి-గుంటూరు : ఇంజినీరింగ్ కోర్సును నాలుగేళ్ల కష్టపడి పూర్తిచేసే విద్యార్థులందరూ సూపర్ స్టార్లేనని యువ సినీ దర్శకులు అనిల్ రావిపూడి అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్శి టీలో ఇంజినీరింగ్ పూర్తి చేసి పూర్వ విద్యార్థుల కలయికలో భాగంగా వర్సిటీకి శనివారం వచ్చిన అనిల్ రావిపూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ, విజ్ఞాన్స్ లారా ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులతో సరదాగా ముచ్చటించారు. తాను విద్యార్థిగా ఉన్నప్పుడు యూనివర్సిటీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే జాతీయ స్థాయి మహోత్సవ్ కార్యక్రమంలో స్కిట్ డైరెక్ట్ చేసి ఉండకపోతేతే తానీరోజు ఈ స్థాయిలో ఉండేవాడిని కాదని అన్నారు.



అవకాశాలు మన దగ్గరకు రావని, మనమే వాటికి ఎదురెళ్లి తీసుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థికీ జీవితంలో నిర్దిష్టమైన లక్ష్యం ఉండాలని, దాన్ని సాధించే వరకూ అవిశ్రాంతంగా కష్టపడాలని సూచించారు. వినూత్న ఆలోచనలకు సృజనాత్మకత, సాంకేతికతను ఉపయోగి ంచుకుంటే జీవితంలో ముందుకు దూసుకెళ్లొచ్చన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ లారా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.ఫణీంద్రకుమార్, విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.

మలబార్‌లో వెండి ఆభరణాల ప్రదర్శన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్ షోరూమ్ లో వెండి ఆభరణాల ప్రదర్శనను శనివారం ప్రారంభించారు. లక్ష్మీపురం మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్ లో ఫిరంగిపురం మండల పరిషత్ అధ్యక్షురాలు షేక్ సహేలా నర్గిస్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాణ్యమైన మన్నికైన బంగారు, వెండి ఆభరణాలు సరికొత్త డిజైన్లు మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ అందుబాటులో ఉన్నాయన్నారు.

మార్కెటింగ్ మేనేజర్ సిహెచ్ గోపి కిరణ్ మాట్లాడుతూ ఈ వెండి ఆభరణాల ప్రదర్శనలలో ప్రతి 5000 వేలు వెండి ఆభరణాలు కొనుగోలు పై 500 ప్రత్యేక తగ్గింపు ఉందన్నారు. ఈ ప్రదర్శన 24 డిసెంబర్ నుండి జనవరి 2 వరకు నిర్వహించటం జరుగుతుందని అన్నారు. గుంటూరు స్టోర్ హెడ్ నదీర్, అసిస్టెంట్ స్టోర్ హెడ్ రెహమాన్, స్టోర్ మేనేజర్ వరప్రసాద్ పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో

31న కల్చరల్ నైట్

ప్రజాశక్తి - మంగళగిరి



భారత విద్యార్థి ఫెడరేషన్, భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఈ నెల 31వ తేదీ సాయంత్రం ఏడు గంటలకు టిప్పర్ల బజార్లో కల్చరల్ నైట్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లుగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం బాలాజీ తెలిపారు. ఈ మేరకు శనివారం ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో కరపత్రాన్ని ఆవిష్కరించారు. డాన్స్, పాటలు, పద్యాలు, డైలాగ్స్, కవితలు, మిమిక్రీ, స్కిప్ట స్వల్ప కాలిక నాటకం చేయవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పఠాన్ మున్నా, ఎస్ఎఫ్ఐ నాయకులు మహమ్మద్ అష్రఫ్, పట్టణ గర్ల్స్ కన్వీనర్ కే నాగమణి తదితరులు పాల్గొన్నారు.

పైపులైను కోసం గోతులు.. కదలని వాహనాలు..



ప్రజాశక్తి-తాడేపల్లి: తాడేపల్లి పట్టణంలోని నులకపేటలో కొత్తగా వాటర్ పైపులైన్ నిర్మించడానికి ఇటీవల మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం అధికాఇరులు గోతులు తీయించారు. తీసిన గోతులు అలాగే వదిలేయడంతో వాటిల్లో వాహనాలు దిగబడిపోయి నిలిచిపోతున్నాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇక్కట్ల పాలవుతున్నారు. పైపులైన్ నిర్మాణం కోసం సిమెంటు రోడ్లు పగులకొట్టి మరీ గోతులు తీశారు. దాని పక్కన సైడ్ బర్నర్స్ వేయకపోవడంతో ఏదో ఒక వాహనం గోతుల్లో దిగబడిపోతుంది. ద్విచక్ర వాహనదారులు కూడా తీవ్ర ఇబ్బందుల పాలవుతున్నారు. సంబంధిత అధికారులు జోక్యం చేసుకుని వెంటనే రోడ్లు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆస్తి పన్నును నూరుశాతం వసూలు చేయాలి

జిఎంసి ఇన్‌ఛార్జి కమిషనర్ పెద్ది రోజా

ప్రజాశక్తి-గుంటూరు



వడ్డీ లేకుండా ఆస్థి పన్ను చెల్లింపునకు ఈ నెల 31వ తేదీ వరకూ అవకాశం ఉన్నందున ప్రస్తుత అర్థ సంవత్సరానికి సంబంధించి వంద శాతం పన్నులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ విభాగం అధికారులను నగర పాలక సంస్థ ఇన్‌ఛార్జి కమిషనర్ పెద్ది రోజా ఆదేశించారు. శనివారం ఆమె తన చాంబర్‌లో ఆస్తి, నీటి, ఖాళీ స్థల పన్ను వసూళ్లు, షాప్ లీజులు, కోర్ట్ కేసులపై ఆర్వోలు, ఆర్ఐలతో సమీక్షించారు. ఆర్ఐల వారీగా పన్ను డిమాండ్, వసూళ్లపై సమీక్షించారు. పన్ను వసూళ్లు నూరు శాతం జరగాల్సిందేనన్నారు. అన్ని వార్డులలో బకాయిదారులకు తెలిసేలా ఆటోల ద్వారా ప్రచారం నిర్వహించాలని, అందుకు యాక్షన్ ప్లాన్ సిద్దం చేయాలని చెప్పారు. ఆస్తిపన్నుపై వడ్డీ మాఫీ చేసే అవకాశం లేనందున మార్చి వరకు వేచి చూడకుండా బకాయిదార్లను చైతన్యపరిచి వసూళ్లు వేగవంతం చేయాలన్నారు. మొండి బకాయిదార్లపై రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని, రెడ్ నోటీసులు, ఆక్యుపై నోటీసులకు స్పందించని వారికి అత్యవసర సేవలను తొలగించేందుకు నోటీసులు జారీ చేసి, చర్యలు తీసుకోవాలని చెప్పారు. నీటి కుళాయిల పన్ను వసూళ్లు వేగవంతం చేయాలని, ఆస్తి పన్నులో నీటి ఛార్జీలతో పాటు కుళాయిల డొనేషన్లు కూడా చెల్లించకపోవడం గమనించి, డొనేషన్లు, నీటి ఛార్జీల వారీగా వేరువేరుగా జాబితాలు సిద్ధం చేయాలని సూపరిండెంట్‌ను ఆదేశించారు. ఆర్ఐల వారీగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లు, షాప్స్ వారీగా బకాయిల వసూళ్లు నూరు శాతం జరగాలని, పెండింగ్‌లో ఉన్న బకాయిల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆదేశించారు. రెన్యువల్స్ పూర్తవ్వని షాపులకు వెంటనే రెన్యువల్‌కు సిఫార్స్ చేయాలన్నారు.

ఆకర్షణీయమైన ప్రకటనలతో మోసపోవద్దు



వినియోగదారుల హక్కుల పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న మండల తహశీల్దార్ జి.సుజాత

ప్రజాశక్తి-చిలకలూరిపేట

వినియోగదారుల హక్కుల పోస్టర్ ను మండల తహశీల్దార్ జి.సుజాత శని వారం స్థానిక కార్యాలయంలో ఆవిష్కరించారు. జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వినియోగదారులకు పలుసూచనలు చేశారు. ప్యాకింగ్ చేసిన ఆహార పదార్థాలు, పానీయాలు, మందులు మొదలైనవి కొనుగోలు చేసే ముందు వాటిని తయారు చేసిన తేదీ, ఎప్పటివరకు వినియోగించవచ్చనే సమాచారాన్ని తప్పనిసరిగా పరిశీలించాలని చెప్పారు. చేపలు కొనుగోలు చేసే షాపులు పరిసరాలు శుభ్రంగా ఉన్నాయో లేదో పరిశీలించి కొనుగోలు చేయాలని, అనుమతి లేకుండా ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్ బాటిల్స్‌ను వాటర్ ప్లాంట్లు విక్రయించకూడదని,రసాయనాలు చల్లిన పండ్లు, కూరగాయలు తిని కేన్సర్ రోగాలను తెచ్చుకోవద్దని, మాంసం, ఇన్సూరెన్స్ పాలసీలు, వాహనాలు కొనుగోలు చేసే సమయంలో ఒరిజినల్ డాక్యుమెంట్స్,ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పొలాల కొనుగోలు సమయంలో పాటించాల్సిన జాగ్రత్తలు మొదలైన విషయాల గురించి ప్రస్తావించారు. ఐఎస్ఐ, అగ్మార్క్ ఉన్న వస్తువులను, బిఎస్ఐ హాల్ మార్క్ బంగారు నగలు మాత్రమే కొను గోలు చేయాలని సూచించారు. ఆకర్షణీయమైన ప్రకటనలు, భారీ డిస్కౌంట్‌లను చూసి మోసపోవద్దని, కిరాణా, ఇతర సామాన్లు కొనుగోలు చేసేటప్పుడు తూనికలు కొలతలను సరిగా పరిశీలించడం వినియోగదారుడి హక్కు అని అన్నారు. కార్యక్రమంలో వినియోగదారుల పరిరక్షణ కమిటి పల్నాడు జిల్లా అధ్యక్షుడు మురికిపూడి ప్రసాద్,నిడమానూరి రవికుమార్ షేక్ అబ్దుల్ జబ్బార్, భవిరిసెట్టి మణి, పొత్తూరి బ్రహ్మానందం, పొన్నం శ్రీనివాస్, తవ్వా నాగమల్లేశ్వర రావు పాల్గొన్నారు.

వ్యక్తిగత వివాదాలను నాకు చుట్టొద్దు

ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



ప్రజాశక్తి - నరసరావుపేట

వ్యక్తిగత వివాదాల నేపథ్యంలో జరిగిన హత్యను టిడిపి రాజకీయ లబ్ధి కోసం ఉపయోగించుకోవాలని చూస్తోందని, ఎమ్మెల్యే కనుసన్నల్లో జరిగిందని ఆరోపిస్తూ తనను అరెస్ట్ చేయాలని వ్యాఖ్యలు చేయడం సబబు కాదని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పల్నాడులో ఏం జరిగినా స్థానిక ఎమ్మెల్యేకు ఆపాదించే పనిలో టిడిపి ఉండడం బాధాకరమన్నారు. పల్నాడులో ఏ హత్య జరిగినా దాన్ని రాజకీయ హత్యగా మార్చి లబ్ధి పొందాలని చూస్తోందంటూ టిడిపిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పల్నాడులో హత్యా రాజకీయాలు జరుగుతున్నాయని లోకేష్, అచ్చెంనాయుడు, జీవీ ఆంజనేయులు, యరపతినేని, పత్తి పాటి పుల్లారావులు వ్యాఖ్యల చేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా పల్నాడులో కోడెల హయాంలో జరిగిన వివాదాలపై ప్రస్తావించారు. ఇటీవల హత్యకు గురైన ఇబ్రహీం ఘటనలో నిందితు లను పోలీసులు అరెస్ట్ చేయడం జరిగిందన్నారు. హత్యకేసులో ప్రాథమిక విచారణ సమయంలో వెల్లడైన విషయాలను పోలీసులు వివరించిన నేపథ్యంలో ప్రజలకు వాస్తవాలు తెలియాల్సిన అవసరం ఉందన్నారు. రెండు వర్గాల మధ్య జరిగిన గొడవను పార్టీలకు ఆపాదించి లబ్ధిపొందాలని చూస్తే ఎలా? కోడెల హయాంలో నరసరావుపేటలో ప్రశాంతంగా ఒక్కరైనా వ్యాపారాలు చేసుకున్నారా? అని ప్రశ్నించారు.

పరగటిచర్లలో 'గడప గడపకు'

ప్రజాశక్తి - రొంపిచర్ల

రొంపిచర్ల మండలంలోని పరగటిచర్లలో శనివారం సాయంత్రం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ముందుగా గ్రామంలోని చర్చి వద్ద జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకలో ఆయన పాల్గొన్నారు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. క్రిస్మస్ శుభాకాంక్షలు తెలి పారు. అనంతరం ఇంటిఇంటికి వెళ్లి జగనన్న మూడేళ్ల పాల నలో జరిగిన మేలును వివరించారు.



పేరూర్లపాడులో గడపగడపకు

ప్రజాశక్తి - వినుకొండ

నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం పేరూరిపాడు గ్రామం లో 2వ రోజు గడప గడపకు మన ప్రభుత్వము కార్యక్రమం శనివారం చేపట్టారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హాజరై ప్రతి ఇంటి కి తిరుగుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను, జరిగిన అభివృద్ధిని వివరించారు. గ్రామంలో ప్రతి ఇంటికి గడప వద్దకు వెళ్లి వారికి ఇంకేమైనా సమస్యలు ఉన్నాయా అంటూ అడిగి తెలుసుకున్నారు.

నవంబర్ జీతాలు వెంటనే చెల్లించండి

ప్రజాశక్తి-చిలకలూరిపేట

కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాల (కెజిబివి)లో పని చేస్తున్న ఉపాధ్యాయిలకు నవంబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని శనివారం రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. డిసెంబరు నెల ముగియడానికి సిద్ధంగా ఉన్న ఇంకా నవంబరు జీతాలు చెల్లించకపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు.

ఉత్సాహంగా సెమీక్రిస్మస్



వినుకొండలోని నిర్మల బాలిక ఉన్నత పాఠశాలలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-అమరావతి

ఏసుక్రీస్తు బోధనలు అందరూ పాటించి ప్రపంచాన్ని ప్రేమమయం చేయాలని పెదకూరపాడు శాసనసభ్యులు నంబూరు శంకరరావు అన్నారు. శనివారం రాత్రి అమరావతి మండలం ధరణికోట ఆంధ్రా ఇవాంజికల్ లూథరన్ సంఘం వారి క్రీస్తు లూథరన్ దేవాలయంలో ధరణి కోట కొండవీటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన సెమీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్ పావని రాం బాబు, ఎంపిటిసి కంభంపాటి శాం తమ్మ మత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే శుభాకాంక్షలు

ప్రజాశక్తి-నరసరావుపేట

క్రైస్తవ సోదరుల పెద్ద పండుగ క్రిస్మస్ పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. క్రైస్తవ సోదరులకు శనివారం ఒక ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలి పారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి నల్లపాటి రామచంద్ర ప్రసాద్ కూడా మరో ప్రకటనలో క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట :టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రత్తిపాటి పుల్లారావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలి పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యేసు క్రీస్తు బోధనల సారాంశాన్ని మానవాళి గ్రహించాలని సూచించారు.



అమరావతిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నంబూరు

ప్రజాశక్తి - వినుకొండ

ఇమ్మానుయేలు తెలుగు బాప్టిస్ట్ చర్చి ఆధ్వర్యంలో యాచకులకు క్రిస్మస్ ప్రేమ పూర్వక విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు బేతం శ్యాం ప్రసాద్ అధ్యక్షత వహించారు. సంఘ కాపరి రెవరెండ్ పత్రా ఫిలిప్ సందేశ మిచ్చారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా నాదెపు ఏసుదాసు పాల్గొన్నారు. రెండు వందల మంది యాచకులకు విందు ఏర్పాటు చేశారు. స్థానిక నరసరావుపేట రోడ్డులోని నిర్మల బాలిక ఉన్నత పాఠశాలలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని నిరుపేద విద్యార్థినిలకు మున్సిపల్ ఏఈ నాగేశ్వరరావు, పాఠశాల పూర్వ విద్యార్థిని పోకూరి శిరీష శరత్ చంద్ర లు కలసి 20 మంది పేద విద్యార్థులకు నూతన వస్త్రాలు అందజేశారు. కార్యక్రమంలో సుపీరియర్ సిస్టర్ క్యాస్పర్, సిస్టర్ సెలీనా, సిస్టర్ మేరీ సిద్ధార్థి పాల్గొన్నారు.స్థానిక తిమ్మాయపాలెం రోడ్డులోని హర్ష హైస్కూల్లో సెమీ క్రిస్మస్ వేడుకలు జరిగాయి. పాఠశాల కరస్పాండెంట్, డైరెక్టర్ పి.శ్రీనివాసరావు,పాస్టర్ జేమ్స్ వాషింగ్టన్ హాజరయ్యారు.

ప్రజాశక్తి-చిలకలూరిపేట

గణపవరంలోని చౌటుపాలెంలో ఉన్న బైబిల్ ఫెయిత్ లూథరన్ చర్చిలో సెమి క్రిస్మస్ నిర్వహించారు. జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమం లో చర్చి పాస్టర్ బి.బర్నబాస్,మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, నాదెండ్ల ఎస్సై ఎ.భాస్కర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ డి.చిట్టిబాబు, .కౌన్సిలర్ పి.సాగర్ బాబు, సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు

పెన్షన్ల తొలగింపు అపోహలు నమ్మొద్దు - కలెక్టర్ శివశంకర్



ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

జిల్లాలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు, సామాజిక భద్రతా పెన్షన్లు ప్రభుత్వం అందిస్తోందని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. శనివారం జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రేషన్‌కార్డులు, పెన్షన్‌లను తొలగిస్తున్నారంటూ వస్తున్న అపోహలను ఎవరూ నమ్మొద్దని కోరారు. అంతకు ముందు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి పూనం మాల కొండయ్య జూమ్ యాప్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కొత్త ఏడాదిలో ప్రజలకు పంపిణీ చేసే రేషన్ కార్డులు, పెన్షన్ల పంపిణీ,ధాన్యం సేకరణ వంటి పలు అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లతో చర్చించారు. పల్నాడు జిల్లాలో జరుగుతున్న ధాన్యం సేకరణ, కొత్త రేషన్ కార్డులు, పెన్షన్ల పంపిణీ కార్యక్రమం జరుగుతున్న తీరును కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఆన్‌లైన్ ద్వారా ప్రజలకు జరుగు తున్న సంక్షేమ పథకాల పంపిణీపై ప్రతి ఆరు నెలలకోసారి అప్‌డేట్ చేయడం వంటి చర్యలు తీసుకుంటున్న క్రమంలో కొంత మంది కి ప్రభుత్వ నిబంధనల ప్రకారం అనర్హతగా నమోదు అని చూపడంతో ఈ విషయం పై ఆయా మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలతో సమావేశం నిర్వహించి, మరోసారి విచారణ నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆరు రకాల విచారణలో భాగంగా అనర్హత చూపుతున్న వారిపై తగిన నోటీసు ఇచ్చి వాస్తవ విచారణలో వచ్చిన నివేదిక ప్రకారం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తామన్నారు. వాస్తవ నివేదిక వచ్చే వరకు రేషన్ కార్డులు కానీ, పెన్షన్ కానుక కాని తొలిగించబోమని స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి, ఆగస్టు నెలల్లో ఇప్పటివరకు 13,602 పెన్షన్‌లు అందించాగా, వచ్చే కొత్త ఏడాదిలో కొత్తగా 8,818 పెన్షన్లు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో రేషన్ కార్డుల లబ్దిదారుల్లో అనర్హత చూపుతున్న వారి సంఖ్య 19,121 ఉందన్నారు. కొత్తగా మరో 1,602 రేషన్ కార్డులు మంజూరయ్యాయని వాటిని జనవరిలో పంపిణీ చేస్తామన్నారు. వివరాలు (సిక్స్ స్టెప్ వ్యాలి డేషన్) ఆధారంగా అర్హుల జాబితాను తయారు చేయడంతో పాటు, అధికారులు సమన్వయంతో విచారణ నిర్వహించి ప్రతిఒక్కరికీ రేషన్ కార్డులు, పెన్షన్ లు వచ్చేలా చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో జరిగే విచారణకు ప్రజలు సమన్వయంతో ప్రభుత్వానికి సహకరించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, డిఆర్ఒ వినాయకం, డిఆర్‌డి బాలునాయక్, డిఎస్ఒ మోహన్ బాబు, సివిల్ సప్లయ్ డి.ఎం వరలక్ష్మి పాల్గొన్నారు.

గుంటూరు సైక్లర్స్‌కు డిఐజి అభినందన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి



నవంబర్ నెల 30వ తేదీ న హైదరాబాద్ సైకిల్ లిస్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు జరిగిన సైకిల్ రైడ్ ను పూర్తి చేసి గుంటూరుకు తిరిగి వచ్చిన మన గుంటూరు వాస్తవ్యులు ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం స్విమ్మర్ బండ్లమూడి సుబ్బయ్య మరియు జెకెసి కాలేజ్ ఫిజికల్ ట్రైనర్ మేదరమెట్ల అనిల్ అనిల్ కుమార్ లను శనివారం తన కార్యాలయంలో డిఐజి త్రివిక్రమ్ వర్మ గారు అభినందించారు. నవంబర్ 30వ తేదీన కాశ్మీర్లో ప్రారంభమై డిసెంబర్ 22వ తేదీన కన్యాకుమారి వరకు 3700 కిలోమీటర్ల సైకిల్ రైడ్ ను వీరు విజయవంతంగా పూర్తి చేసి దేశంలో రాష్ట్ర మరియు జిల్లా యొక్క పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేశారని ఆయన తెలిపారు. అనంతరం సైక్లర్ సుబ్బయ్య గారు మాట్లాడుతూ భారతదేశ జనాభా అంతా కూడా సైక్లింగ్ ని ప్రోత్సహిస్తూ ఆరోగ్యంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం స్విమ్మింగ్ కోచ్ షేక్ కాజా మొహిద్దిన్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీపూజిత స్కూల్లో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు క్రీస్తు జననం నాటికను నృత్య రూపకంలో ప్రదర్శించారు. విద్యార్థులు క్రిస్మస్ ట్రీ, స్టార్లు, రంగురంగుల బెలూన్లతో పాఠశాల ప్రాంగణాన్ని సుందరంగా అలంకరించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ విద్యార్థులు శాంతి, సహనం, త్యాగం అలవర్చుకోవాలన్నారు



కన్న స్కూల్లో సెమీక్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-గుంటూరు : స్థానిక వల్లూరి వారితోటలోని కన్న స్కూల్లో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు యేసుక్రీస్తు గుణగణాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో తాడికొండ సునీత, జెసి తదితరులు

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-గుంటూరు

ప్రజలు వస్తువుల కొనుగోలు, సేవలలో మోసపోకుండా ఉండాలంటే వినియోగదారుల రక్షణ చట్టాలపై విస్తృతంగా అవగాహన కలిగి ఉండాలని జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ అధ్యక్షులు తాడికొండ సునీత అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జిల్లా వినియోగదారుల వ్యవహారాలు, ఆహర పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారు కమిషన్లలలో కేసులను సమర్థవంతంగా పరిష్కరించటం అనే అంశంపై నిర్వహించిన సదస్సులో తాడికొండ సునీత, జిల్లా సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలసి పాల్గొన్నారు. తాడికొండ సునీత మాట్లాడుతూ వ్యాపార, సేవల రంగంలో వినియోగదారుడికి అత్యంత ప్రాధాన్యత ఉందని, వస్తువుల కొనుగోలు, సేవలు పొందటం లో నష్టం జరిగితే పరిహారం కోసం వినియోగదారుల వివాదాల పరిష్కారానికి కమిషన్‌ను ఆశ్రయించవచ్చన్నారు. ఎయిర్ లైన్స్ నుంచి రైల్వే, పోస్టల్, మెడికల్, బ్యాంకింగ్, నాన్ బ్యాంకింగ్, ఇన్సురెన్స్, టెలికం, ఈపీఎఫ్ వంటి అన్ని రకాల సంస్థల సేవల లోపాలపై కమిషన్‌లో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కమిషన్ బాధ్యతలు స్వీకరించే సమయానికి జిల్లాలో 557 కేసులు పెండింగ్‌లో ఉండగా వాటిలో ఇప్పటి వరకు 286 పరిష్కరించటం జరిగిందన్నారు. జెసి రాజకుమారి మాట్లాడుతూ ఆఫర్లు, డిస్కౌంట్ల ప్రకటనలు చూసి మోసపోకుండా నాణ్యమైన వస్తువులను కొనుగోలు చేయాల్సిన బాధ్యత వినియోగదారులకు ఉందని, ముఖ్యంగా ఆహార పదార్ధాల కొనుగోలు విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ద్వారా ఇబ్బందులు పడుతున్నామని ఫిర్యాదులు చేసే వారి సంఖ్య ఎక్కువుగా ఉంటుందని, కావున తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ సభ్యులు పున్నారెడ్డి, కె.విజయలక్ష్మీ, జిల్లా ఫుడ్ కంట్రోలర్ గౌస్ మోహిద్దీన్ తదితరులు ప్రసంగించారు. అనంతరం పాఠశాల, కళాశాల విధ్యార్థులకు వ్యాసరచన, వకత్వం పోటీలలో విజేతలకు నగదు బహుమతులు, మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో డిఎస్ఒ పద్మశ్రీ, పౌర సరఫరాల జిల్లా మేనేజరు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సామాజిక ఉద్యమకారుడు పెరియార్‌కు నివాళి

ప్రజాశక్తి-గుంటూరు : సామాజిక న్యాయం కోసం, సమసమాజ నిర్మాణం కోసం తన జీవిత కాలం కృషి చేసిన గొప్ప సామాజిక విప్లవకారుడు పెరియార్ రామస్వామి నాయకర్ అని బిసి సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ అన్నారు. పెరియార్ వర్థంతి సందర్భంగా శనివారం స్థానిక చుట్టుగుంటలోని బిసి సంక్షేమ సంఘం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అన్ని కులాల వారికీ దేవాలయ ప్రవేశం ఉండాలని పెరియార్ వాదించాడని, బలవంతంగా హిందీ బోధన చేయటంపై ఉద్యమించి, హిందీ బోధనను విరమింపచేశాడన్నారు. ఆయన అనుచరులు తర్వాత డిఎంకె, ఎఐడిఎంకె ఏర్పాటు చేశారన్నారు. ఈ రెండు పార్టీలే అప్పటి నుండి తమిళనాడు రాజకీయాలను శాసిస్తున్నాయని చెప్పారు. కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.నాగమల్లేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు మల్లె ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బీమ్ భారత్ నివాళి..

ఆత్మగౌరవ ఉద్యమ పితామహుడు పెరియార్ రామస్వామి వర్థంతి సందర్భంగా స్థానిక అరండల్‌పేటలోని బీమ్ భారత్ కార్యాలయంలో సంఘ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్, తదితరులు ప్రసంగించారు.



ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి, మణిపాల్ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం ఎంటిఎంసి పరిధిలోని వడ్డేశ్వరం ఎంపియుపి స్కూల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి అధ్యక్షులు మున్నంగి వివేకానంద రెడ్డి మాట్లాడుతూ ఉచిత వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించిందని, సుమారు 200 మందికి బిపి, షుగర్, గుండెకు సంబంధించిన ఈసీజీ పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. మందులు అందజేసిన గోపు సుబ్బారావు కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అఫ్ తాడేపల్లి కార్యదర్శి కాట్రగడ్డ శివన్నారాయణ, కోశాధికారి శెట్టి రామకష్ణ, డిస్టిక్ గవర్నర్ తల్లా రాజశేఖర్ రెడ్డి, రోటరీ సభ్యులు వైస్ ప్రెసిడెంట్, సభ్యులు కిరణ్ పరుచూరి,జొన్న రాజేష్, సుకుమార్ రెడ్డి, రవీంద్రారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బసివి రెడ్డి, గోపు నాగ రాజేష్, శంకర్ శెట్టి రమేష్, చంద్ర ఓబులారెడ్డి, భువనగిరి నుంచి వచ్చిన రోటరీ అధ్యక్షులు శ్రీనివాసరావు,సభ్యులు, మరియు గ్రామ సచివాలయ కార్యదర్శి ఎంం ఎల్ వి ప్రసాద్, గ్రామ పెద్దలు కత్తిక, మల్లికార్జునరావు, కత్తిక రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



కొలనుకొండలో కెఎల్‌యు విద్యార్థుల పర్యటన

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్

పేదరికంతో మధ్యలోనే చదువు ఆగిపోకూడదని కెఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ అబ్దుల్ బాసిత్ అన్నారు. శనివారం కేఎల్ విశ్వవిద్యాలయంలోని వ్యవసాయ కళాశాల ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లతో కలిసి కొలనుకొండ గ్రామంలో పర్యటించి గ్రామస్తులకు విద్య విలువ పట్ల అవగాహనా కార్యక్రమం నిర్వహించినట్లు వ్యవసాయ విభాగ అధిపతి సెంథిల్ మురుగన్ తెలిపారు. చదువు మధ్యలో ఆపివేసిన విద్యార్థులను గుర్తించేందుకు గాను ఇంటింటి తిరిగి సర్వే చేశారని అన్నారు. విద్యతోనే విద్యార్థుల తలరాత మారుతుందని ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ పి. శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. చదువును మధ్యలో ఆపడం వలన ఒక తరం మంచి భవిష్యత్తును కోల్పోతుందన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎన్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ ఏ. జగదీష్, సాక్ డైరెక్టర్ పి. సాయి విజయ్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ర్యాలీ పోస్టర్ ఆవిష్కరిస్తున్న శంకరరావు తదితరులు

7న తెనాలిలో బీసీల నిరసన ర్యాలీ

ప్రజాశక్తి - తెనాలి

జనాభా దామాషా ప్రకారం అధిక సంఖ్యలో ఉన్న బీసీలు పాలక పక్షాల వైఖరితో నిరాదరణకు గురవుతున్నారని, పలు విదాలుగా నష్టపోతున్నారని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు అన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ జనవరి 7న పట్టణంలో పలు బీసీ సంఘాలను కలుపుకొని నిర్వహిస్తున్న భారీ ర్యాలీ జయప్రదం చేయాలని ఆయన కోరారు. ర్యాలీ పోస్టర్‌ను ఈ సందర్భంగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జై వెంకటేశ్వరరావు, ఎం గంగా యాదవ్, క్రాంతి కుమార్ తదితరులు పాల్గొన్నారు

కారుమూరి యశోద ఆనందరావు ఛారిటబుల్ ట్రస్ట్ వితరణ

ప్రజాశక్తి - చేబ్రోలు



చేబ్రోలు గ్రామం లోని చెరువులో పాలెంలో 100 మంది వద్దులు మరియు వితంతువులకు క్రిస్మస్ పండుగ సందర్భముగా చీరలు పంపిణీ చేయడం జరిగిందని, కారుమూరి యశోద ఆనందరావు చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జే ఎన్ టి యు ప్రొఫెసర్ డాక్టర్ కారుమూరి రాజశేఖర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరము క్రిస్మస్ సందర్భంగా వద్ధులకు వితంతువులకు నూతన వస్త్రాలను బహుకరించటం హర్షించదగిన విషయమని అన్నారు. చైర్మన్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ సహనం శాంతి దయ లాంటి మార్గాలను చూపిన ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శమని అన్నారు. కార్యక్రమంలో శేకూరు పంచాయతీ కార్యదర్శి బి ప్రశాంతి తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ చుండూరు సామ్సన్ వార్డ్ మెంబర్ కారుమూరి శ్యామ్ పెద్దలు కారుమూరి లోకయ్య ఎంపీటీసీ బాణాల ఝాన్సీ స్థానిక పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు ఇకెవైసి నమోదు

ప్రజాశక్తి - చేబ్రోలు



పిఎం కిసాన్ ఇకెవైసి నమోదు 30వ తేదీలోపు చేయించుకోవాలని పొన్నూరు వ్యవసాయాధికారి సిహెచ్ తిరుమల దేవి తెలిపారు. శనివారం ఆమె గొడవర్రు ఆర్‌బికెను సందర్శించారు. ఆర్‌బికెలో ఇకెవైసి నమోదు కాని రైతులు 360 మంది ఉండగా, రైతులతో ఫోన్ ద్వారా ఆమె మాట్లాడారు. చేబ్రోలు మండలంలో మొత్తం 7,389 మంది ఇకెవైసి చేయించుకోవాల్సిన రైతులున్నారని, వారిలో 5031 మంది చేయించుకున్నారని, మిగిలిన 2,358 మంది పెండింగ్ ఉన్నారన్నారు. నెలాఖరుతో గడువు ముగియనున్నందున వారితో కూడా ఇకెవైసి నమోదు చేయించాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి బి.శ్రనివాస నాయక్ మాట్లాడుతు ఆధార్ కు లింకు అయిన ఫోన్ నెంబర్‌కు వచ్చే ఓటిపితో ఈకేవైసీ చేయించుకొనవచ్చు అని తెలిపారు.

'షైన్'లో బాలలకు అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : పోలవరం రిటైర్డ్ స్పెషల్ కలెక్టర్ చదలవాడ భానుప్రసాద్ కుమారుడు కిరణ్‌తేజ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మండలంలోని చినకాకానిలో ఉన్న షైన్ ఆనంద శరణాలయంలోని బాలబాలికలకు శనివారం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా భానుప్రసాద్ కుటుంబసభ్యుల సమక్షంలో శరణాలయం నిర్వాహకులు సెమీ క్రిస్మస్ వేడుకలు ఏర్పాటు చేశారు. కేక్‌ను భానుప్రసాద్ కట్ చేసి చిన్నారులకు శుభాకాంక్షలు తెలిపారు. బాలబాలికలకు అవసరమైన జామెట్రీ బాక్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో చదలవాడ శైలజా దేవి, డాక్టర్ లక్ష్మి ప్రియ, డాక్టర్ ఉప్పుటూరి హేమంత్, ఆంధ్రప్రభ రీజనల్ మేనేజర్ రంగారావు, షైన్ ఆనంద శరణాలయం చైర్మన్ డిజి నాయక్, శరణాలయం నిర్వాహకులు సంధ్యా రాణి పాల్గొన్నారు.



తప్పులు సవరించాలి : ఎస్‌టియు

ప్రజాశక్తి - పెదనందిపాడు

ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి శనివారం గుంటూరు జిల్లా విద్యాశాఖ విడుదల చేసిన ఉపాధ్యాయుల సీనియార్టీ జాబితా కొన్ని సాంకేతిక సమస్యల వల్ల తప్పులు తడకగా ఉందని ఎస్టియు గుంటూరు జిల్లా అధ్యక్షులు గేరా మోహనరావు పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి సీనియార్టీ జాబితాలోని సాంకేతిక సమస్యలను తొలగించి అర్హత గల ఉపాధ్యాయులందరికీ పాయింట్లు కేటాయించి సమగ్రమైన సీనియార్టీ జాబితా విడుదల చేసి, బదిలీలను పారదర్శకంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేశారు

పల్నాడు జిల్లాకు 35 కొత్త బస్సులు

వినుకొండ డిపోలో 9 వేల లీటర్ల డీజిల్ వ్యత్యాసంపై డిఎంఐ విచారణ

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

పల్నాడు జిల్లాలోని 7 డిపోల్లో 59 నూతన బస్సులు మంజూరు కాగా ఇప్పటికే 35 బస్సులు అందుబాటులోకి వచ్చాయని ఆర్టీసీ రీజియన్ డిప్యూటీ మెకానికల్ ఇంజినీర్ నర్రా శ్రీనివాసరావు తెలిపారు. వినుకొండ డిపోలో 9 వేల లీటర్ల డీజిల్ వ్యత్యాసంపై విచారణ కోసం డిపోకు శనివారం ఆయన వచ్చారు. ఆయిల్ పంపులు గన్నులు పాతవి కావడంతో కొంత ఆయిల్ కారిపోతుందని, కొంత డీజిల్ డ్రై అయిపోయిందని గుర్తించినట్లు చెప్పారు. ఆయిల్ ట్యాంకర్లు ఫిల్లింగ్ టైంలో జరిగే వ్యత్యాసాలను విచారిస్తున్నామని, ఉద్యోగులు, సిబ్బంది అవినీతి ఏమైనా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లాలో 23 బస్సులు కాలం చెల్లినవిగా గుర్తించామని, వాటి స్థానంలో ఆరు బస్సులు తెచ్చామని, మిగిలిన 17 బస్సులు త్వరలో వస్తాయని తెలిపారు. జిల్లాలో మొత్తం 479 బస్సులుండగా వాటిలో హయ్యర్ 119, ఆర్టీసీ సంస్థకు చెందినవి 365 బస్సులు ఉన్నట్లు వివరించారు. ఆర్టీసీ సంస్థలో పల్లె వెలుగు 235, హయ్యర్ బస్సులు 75 ఉన్నాయని, బస్సులను ప్రతిరోజూ శుభ్రపరుస్తున్నామని చెప్పారు.



డీజిల్ వ్యత్యాసంపై పరిశీలిస్తున్న డిఎంఐ

కిట్స్ కాలేజీలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-గుంటూరు

కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో కొనాక్ డయాగ్నోస్టిక్స్ సహకారంతో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, ఎటువంటి అనారోగ్య సమస్యలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె.హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.చంద్రారెడ్డి పాల్గొన్నారు.



పొట్టకొట్టకుండా కొనసాగించండి

- ఎర్రబాలెం, బేతపూడి, ఉండవల్లిలో రాజధాని పారిశుధ్య కార్మికుల ధర్నా
- ప్రభుత్వం ప్రకటన చేయకుంటే సచివాలయం వద్ద నిరసన తెలుపుతామని హెచ్చరిక
- 27న గుంటూరులో సిఐటియు ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహిస్తామని ప్రకటన

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

తమను పనిలో కొనసాగించాలని రాజధాని పారిశుధ్య కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం మండలంలోని ఎర్రబాలెం శివాలయం సెంటర్, బేతపూడిలో రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం, సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షులు ఎం.రవి మాట్లాడుతూ డిసెంబర్ చివరితో సుమిత్ ఏజెన్సీ కాంట్రాక్ట్ ముగియనుందని, అయినా పారిశుధ్య కార్మికుల కొనసాగింపునకు సిఆర్‌డిఎ అధికారులు ఇంకా టెండర్లు పిలవలేదని అన్నారు. ఈ నేపథ్యంలో పని భద్రత కోసం ఆందోళన ఉధృతం చేయనున్నట్లు చెప్పారు. 2017 నుండి పని చేస్తున్న పారిశుధ్య కార్మికులను వేరే పని చూసుకోవాలని సిఆర్‌డిఎ అధికారులు చెబుతున్నారని అన్నారు. కరోనా కాలంలోనూ ప్రాణాలకు తెగించి పని చేసిన వారిని తొలగించాలనుకోవడం దుర్మార్గమని, ఇది సంక్షేమ రాజ్యమా, కార్మికుల పొట్టగొట్టే రాజ్యమా? అని నిలదీశారు. కార్మికుల్లో ఏ ఒక్కరిని తొలగించినా పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్మికులకు విశాల మద్దతూ కూడగట్టేందుకు 27వ తేదీన సిఐటియు ఆధ్వర్యంలో గుంటూరులో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, ఉద్యోగ, కార్మిక, ప్రజాసంఘాలు, దళిత సంఘాలను ఆహ్వానిస్తామని ప్రకటించారు. రాజధాని గ్రామాల్లోనూ విస్తృత సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్మికులను కొనసాగిస్తామని ప్రభుత్వం ప్రకటించాలని, లేకుంటే రాష్ట్ర సచివాలయం ఎదుటే నిరసనకు దిగుతామని అన్నారు. సిఐటియు రాజధాని డివిజన్ కార్యదర్శి ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ ఇప్పటికే పొలాలను కోల్పోయిన ఈ ప్రాంత ప్రజలు ఉపాధికి నానా అగచాట్లు పడుతున్నారని, కుటుంబాలు గడవడమే ఇబ్బందిగా ఉందని అన్నారు. ఈ పరిస్థితుల్లో పారిశుధ్య పనిని ఆధారం చేసుకుని కుటుంబాలను నెట్టుకొస్తున్న వారి నోటి దగ్గర కూడు తీయడం దారుణమని అన్నారు. బేతపూడిలో ధర్నాకు జనసేన మంగళగిరి మండల అధ్యక్షులు వి.శ్రీనివాసరావు మద్దతుగా మాట్లాడారు.
ప్రజాశక్తి-తాడేపల్లి : ఉండవల్లిలో పని విరామ సమయంలో నిరసన తెలిపారు. సిఐటియు రాజధాని డివిజన్ నాయకులు వి.వెంకటేశ్వరరావు మాట్లాడారు.


ఎర్రబాలెంలో ధర్నా చేస్తున్న రాజధాని పారిశుధ్య కార్మికులు. ఉండవల్లిలో నిరసన (ఇన్‌సెట్)


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

ఆర్‌విఆర్‌లో ఉమెన్ ప్రొఫెషనల్ మీట్ అప్ సమ్మిట్

ప్రజాశక్తి - గుంటూరు

ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీర్స్ హైదరాబాద్ సెషన్ వారు ఉమెన్ ప్రొఫెషనల్ మీట్ ఆప్-2022 సమ్మిట్‌ను ఆర్‌విఆర్ అండ్ జెసి ఇంజినీరింగ్ కాలేజిలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని వివిధ ఇంజినీరింగ్ కాలేజీల నుండి అధ్యాపకులు పాల్గొన్నారు. సిలికాన్ ల్యాబ్స్ సీనియర్ డైరెక్టర్ అండ్ ఐఈఈఈ హైదరాబాద్ సెషన్ వైస్ ప్రెసిడెంట్ నరసింహన్ వెంకట్ ఆన్‌లైన్ ద్వారా ప్రసంగించారు. భవిష్యత్‌లో రాబోయే సాంకేతిక పరిజ్ఞానాన్ని దృష్టిలో పెట్టుకొని, అధ్యాపక బృందం విద్యార్థులకు నూతన ఆలోచనలతో విజయావకాశాల దిశగా పరిశోధనల వైపు తర్ఫీదుకు ఇటువంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు. అవేరా ఎలక్ట్రిక్ వెహికల్స్ కో-ఫౌండర్ అండ్ సిఇఒ చాందిని చందన మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు చేసే పరిశోధనల్లో ఎదురయ్యే అవాంతరాలను పరిశీలించుకుంటూ విజయ సాధన దిశగా నూతన ఆలోచనలు ఉండాలన్నారు. ప్రపంచంలోని మేధావులతో ఎప్పటికప్పుడు పొందుపరిచిన విశేషాలను తెలుసుకునేందుకు ఐఈఈఈ దోహదపడుతుందని కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ రాయపాటి గోపాలకృష్ణ అన్నారు. కార్యక్రమంలో కళాశాల ట్రెజరర్ డాక్టర్ కొండబోలు కృష్ణప్రసాద్, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ తదితరులు ప్రసంగించారు.

పల్నాడులో ఆరని రాజకీయ మంటలు

పల్నాడు జిల్లా మాచర్లలో ఈనెల 16న జరిగిన ఘర్షణలకు సంబంధించిన రాజకీయ వివాదాల చిచ్చు కొనసాగుతోంది. 9 రోజులుగా మాచర్లలో 144 సెక్షన్ అమలులో ఉంది. తమ పార్టీకి చెందిన బాధితులను పరామర్శించకుండా ఉండేందుకు 144 సెక్షన్ పేరుతో పోలీసులు అడ్డుకుంటున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. వైసిపి దాడుల్లో నష్టపోయిన టిడిపి వారిని పరామర్శించేందుకు ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మాచర్ల రాకుండా ఉండేందుకు 144 సెక్షన్ పొడిగిస్తున్నారని టిడిపి నాయకులు ఆరోపిస్తున్నారు. టిడిపి నాయకులు ఇప్పటికే రెండుసార్లు పిలుపునిచ్చిన 'చలో మాచర్ల'ను పోలీసులు భగ్నం చేశారు. మాచర్లలో వైసిపి నాయకులకు లేని ఆంక్షలు తమకే ఎందుకు అని టిడిపి నాయకులు ప్రశ్నిస్తున్నారు.

మాచర్లలో పరస్పర దాడులు జరిగాయని చెబుతున్న పోలీసులు ఇప్పటి వరకు టిడిపికి చెందిన 10 మందిని అరెస్టు చేశారు. మాచర్ల ఘటనలకు సంబంధించి టిడిపికి చెందిన 24 మందిపై కేసులు నమోదు చేశారు. టిడిపి మాచర్ల నియోజకవర్గ ఇన్‌ఛార్జి జూలకంటి బ్రహ్మారెడ్డిపైతో పాటు పలువురు టిడిపి కార్యకర్తలపై హత్యాయత్నం కేసు నమోదైంది. ఈనెల 16 నుంచి బ్రహ్మారెడ్డి అజ్ఞాతంలో ఉన్నారు. ఈనెల 16వ తేదీన టిడిపి తలపెట్టిన 'ఇదేం కర్మ రాష్ట్రానికి' కార్యక్రమం సందర్భంగా తలెత్తిన ఘర్షణ వల్ల టిడిపి నాయకులు ఎవ్వరూ మాచర్లకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. బ్రహ్మారెడ్డి అజ్ఞాతంలో ఉండగా ఆయన కుటుంబ సభ్యులను మాత్రం టిడిపికి పలువురు రాష్ట్ర మంత్రులు గుంటూరులో పరామర్శించి ధైర్యం చెప్పారు.

మాచర్లలో ఘర్షణలకు టిడిపి, వైసిపి వారు మీరంటే మీరే కారణమని ఇరు పార్టీల వారు పరస్పర ఆరోపణలు చేసుకుంటున్నారు. టిడిపి నాయకులపై ఫిర్యాదు చేసిన వైసిపి నాయకులు, రేషన్ డీలర్ అయిన చల్లా మోహన్ తల్వార్ కత్తి పట్టుకుని కూర్చున్న వీడియోను మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఇటీవలే విడుదల చేశారు. టిడిపి కార్యకర్తలపై ఫిర్యాదు చేసిన వ్యక్తే

7 వీక్షణం

మాచర్లలో విధ్వంసాలకు, ఘర్షణలకు పాల్పడ్డారని టిడిపి నాయకులు చెబుతున్నా పోలీసు అధికారులింకా స్పందించలేదు. దీంతో టిడిపి నాయకులు హైకోర్టును ఆశ్రయించేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇదే నేపథ్యంలో టిడిపి నాయకులపై దాఖలైన ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని కోరుతూ న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నారు.

మాచర్ల ఘటన నేపథ్యంలో పల్నాడు ఎస్‌పి రవిశంకర్‌రెడ్డిపై టిడిపి నాయకులు తీవ్రమైన ఆరోపణలు చేశారు. ఎస్‌పి కంటే ఒక హోంగార్డును ఈ స్థానంలో కూర్చొబెట్టినా శాంతిభద్రతలు పరిరక్షించేవారని చంద్రబాబు నాయుడు చేసిన విమర్శలు పోలీసు శాఖలో కలకలం రేపాయి. చంద్రబాబు నాయుడుతోపాటు టిడిపి నాయకులు చేసిన విమర్శలను పోలీసు అధికారుల సంఘం ఖండించింది. మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్లలో శనివారం పర్యటించడం గమనార్హం. తనకు మాచర్లలో పర్యటించే హక్కు ఉందని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు.

(ఎ.వి.డి.శర్మ)


ఎంపికైన క్రీడాకారాలతో ప్రిన్సిపాల్ తదితరులు

అంతర్ వర్సిటీల పోటీలకు వాగ్దేవి క్రీడాకారులు

ప్రజాశక్తి - నరసరావుపేట : దక్షిణ భారతదేశ స్థాయిలో నిర్వహించే క్రీడా పోటీలకు తమ విద్యార్థులు ఎంపికయ్యారని వాగ్దేవి డిగ్రీ కాలేజి ప్రిన్సిపాల్ ఓగూరి నాగేశ్వరరావు, సెక్రటరీ-కరెస్పాండంట్ రాయల శ్రీనివాసరావు శనివారం తెలిపారు. తమిళనాడులోని మద్రాస్ యూనివర్సిటీలో ఈ నెల 29 నుండి వచ్చే ఏడాది జనవరి 8 వరకు నిర్వహించే దక్షిణ భారతదేశ విశ్వ విద్యాలయాల బాస్కెట్ బాల్, ఫుట్‌బాల్ పోటీలకు ఇర్ల తిరుపతమ్మ, విప్పర్ల వెంకటలక్ష్మి, తమ్మిశెట్టి త్రివేణి, దేరంగుల అమూల్య ఎంపికయ్యారని తెలిపారు. కేరళలోని క్యాలికట్‌లో నిర్వహించే పురుషుల ఫుట్‌బాల్ పోటీలకు తాడికొండ జస్వంత్ కుమార్, తమిళనాడు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో నిర్వహించే పురుషుల బాస్కెట్‌బాల్ పోటీలకు సురదర్శనం రవితేజ, షేక్ రియాజ్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ మేరకు కాలేజీలో శనివారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో క్రీడాకారులను కళాశాల డైరెక్టర్స్ కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాద్, మద్దుల కోటేశ్వరరావు, పాశం కృష్ణారావు, ఇస్కేపల్లి క్రిష్ణకిషోర్, ఫిజికల్ డైరెక్టర్ మద్దాల సైదారావు, రాయల ఆంజనేయులు అభినందించారు.

కెఎల్‌పి విద్యార్థులు ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని డాక్టర్ కెఎల్‌పి పాఠశాల విద్యార్థులు శనివారం గుజ్జనగుండ్ల వరకూ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు-బాధ్యతలను వివరించారు. ప్రిన్సిపాల్ వై.రథినీచౌదరి మాట్లాడుతూ బాధ్యతలను సక్రమంగా నిర్వహించిన వారే హక్కులను పొందే అర్హతను కలిగి ఉంటారని, బాధ్యతలను సరిగా నిర్వహించడం విద్యార్థి దశ నుండే అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాలలో సెమీక్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు ధరించిన శాంతాక్లజ్, ఏంజెల్స్ వస్త్రధారణ ఆకట్టుకున్నాయి. ఏఒ వెంకట్రావు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

